Vist us @ www.sooryasena.com

RNI.No.: TELTEL/2023/85598

# సూర్యసేన

మా అక్షరం ప్రజల మార్పు కోసం

తెలుగు దిన పత్రిక

Published from: Nalgonda - Hyderabad - Warangal - Khammam - Karimnagar - Mahabubnagar - Vijayawada - Guntur - Kurnool




ఆదివారం SUNDAY || 05.10.2025 || నల్గొండ NALGONDA || సంపుటి (Volume): 3 సంచిక (Issue) : 54 || పేజీలు (Pages) : 8 వెల (Rs.) : 2/- || ఎడిటర్: పాల్వాయి జానయ్య Editor: Palvai Janaiah

## బిహార్ యువతకు ఈ సారి డబుల్ బొనాంజా : మోడీ



న్యూఢిల్లీ, అక్టోబర్, 4 (సూర్యసేన ప్రతినిధి): బిహార్ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నిరంతరం శ్రమిస్తున్నాం అని భారత ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. జిఎస్టి తగ్గింపు వల్ల బిహార్ యువతకు ఈ సారి డబుల్ బొనాంజా వచ్చిందని అన్నారు. బిహార్ యువతకు విజ్ఞాన్ భవన్ లో పిఎం- సేతు పథకం ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా ఢిల్లీ విజ్ఞాన్ భవన్ లో మోడీ మీడియాతో మాట్లాడుతూ.. విద్యా, నైపుణ్యాభివృద్ధికి పథకం తోడ్పడుతుందని, బిహార్ లోని 19 జిల్లాల్లో కేంద్రీయ విద్యాలయాలు ఏర్పాటు చేశామని తెలియజేశారు. ఆత్మ నిర్భర్ భారత్, ఉపాధి అవకాశాలు దక్కాలంటే నైపుణ్యాలు కావాలని పిఎం పేర్కొన్నారు.

2వ పేజీ లో...

### నక్సల్స్‌తో చర్చల్లేవ్.. లొంగిపోండి...

## అమిత్‌షా హెచ్చరిక


జగదల్పూర్ అక్టోబర్, 4 (సూర్యసేన ప్రతినిధి): నక్సల్స్‌తో కేంద్రం చర్చలు జరిపే ప్రసక్తే లేదని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మరోసారి స్పష్టం చేశారు. లొంగిపోవాలని విజ్ఞప్తి చేశారు. ఛత్తీస్‌గఢ్‌లోని జగదల్పూర్‌లో శనివారం నాడు జరిగిన ర్యాలీలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. నక్సల్స్ ఆయుధాలు వీడి లొంగిపోవాలని, కేంద్రం ప్రకటించిన పునరావాస పాలసీని అందిపుచ్చుకోవాలని సూచించారు. బస్తర్ ప్రాంతంలో శాంతికి విఘాతం కలిగించే ఎలాంటి చర్యలకైనా మావోయిస్టులు పాల్పడితే భద్రతా బలగాలు గట్టి జవాబిస్తాయని ఆయన హెచ్చరించారు. వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ నాటికి 'రెడ్ టెర్రర్'కు ముగింపు పలికేందుకు కేంద్రం కృతనిశ్చయంతో ఉందని చెప్పారు. 'కొందరు వ్యక్తులు వాళ్లతో (నక్సల్స్) చర్చలు జరపాలంటూ మాట్లాడుతున్నారు.

2వ పేజీ లో...



### ఆయిల్‌పామ్ పంటలతో...

## నూనె అవసరాలను తీర్చుకోవచ్చు



అశ్వారావుపేట/ హైదరాబాద్, అక్టోబర్, 4 (సూర్యసేన ప్రతినిధి): "దేశంలో నూనె ఉత్పత్తుల కొరత ఉంది. విదేశాల నుంచి ఏటా లక్షన్నర కోట్ల విలువైన నూనెలను దిగుమతి చేసుకుంటున్నాం. ఇది దేశీయ అవసరాల్లో 70శాతంగా ఉంది. దేశంలో నూనె అవసరాలను ఆయిల్‌పామ్ పంటల సాగు ద్వారా తీర్చవచ్చు" అని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం లింగాలపల్లిలో టీఎస్ ఆయిల్‌పామ్ ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తెలుగు రాష్ట్రాల స్థాయి ఆయిల్ పామ్ రైతుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు.

2వ పేజీ లో...

## క్షేత్రస్థాయి సర్వే తర్వాతే అభ్యర్థుల ఎంపిక

హైదరాబాద్, అక్టోబర్, 4 (సూర్యసేన ప్రతినిధి): ప్రతి నియోజకవర్గంలో క్షేత్ర స్థాయి సర్వే నిర్వహించిన తర్వాతే స్థానిక సంస్థల అభ్యర్థులను ఎంపిక చేస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జిలతో ఆయన సమావేశమై సమీక్ష నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని సూచించారు. అభ్యర్థుల ఎంపికపై ఎమ్మెల్యేలు, ఇంచార్జిల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటామని, తుది నిర్ణయం మాత్రం పార్టీ అధిష్టానం తీసుకుంటుందని స్పష్టం చేశారు.

**ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా నేతలతో మంత్రి దామోదర భేటీ**

పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు, నాయకులకే స్థానిక సంస్థల టికెట్ల కేటాయింపులో మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూచించారు.



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలతో ఆయన శనివారం బంజారాహిల్స్‌లోని తన నివాసంలో సమావేశం నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై సమావేశంలో చర్చించారు. నాయకుల మధ్య సమన్వయ లోపం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యేలు, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## మార్వాడీలకు అండగా ఉంటాం: కిషన్‌రెడ్డి




హైదరాబాద్, అక్టోబర్, 4 (సూర్యసేన ప్రతినిధి): హైదరాబాద్‌లో కొంతమంది పనికట్టుకుని మార్వాడీ గోబ్యాక్ అంటూ గొడవలు చేయడం మంచి పద్ధతి కాదని, మార్వాడీలకు బీజేపీ ఎప్పుడూ అండగా ఉంటుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. బొల్లారం తుర్కపల్లిలోని కంటోన్మెంట్ బోర్డు స్థలంలో గురు గౌతమ్‌ముని జైన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గోశాల, వెటర్నరీ ఆస్పత్రిని శనివారం తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మతో కలిసి ఆయన ప్రారంభించారు. జైన్ సామాజికవర్గ సభ్యులు గోసేవకు ప్రాధాన్యం ఇచ్చి గోశాల ఏర్పాటు చేయడాన్ని అభినందించారు. జైనులందరూ సనాతన ధర్మాన్ని, అహింసను పాటిస్తూ సంఘసేవ చేస్తున్నారని, భారతదేశంలో 24 శాతం మంది వ్యాపారులు జైన్ కమ్యూనిటీకి చెందిన వారేనని తెలిపారు. భారతీయ సంస్కృతిలో గోవుకు ప్రత్యేక స్థానం ఉందని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు.

## ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్ మారదు



హైదరాబాద్, అక్టోబర్, 4 (సూర్యసేన ప్రతినిధి): రెండు నెలల్లో రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగం టెం డర్ ప్రక్రియ ప్రారంభం కానుందని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. డిసెంబర్ లోపు టెండర్లు పూర్తి చేసి జనవరిలో పనులు ప్రారంభించేలా చేస్తామని చెప్పారు. శనివారం నాడు మంత్రి చిట్యాల లో మీడియాతో మాట్లాడారు. 2017-18లో ప్రధాని మోదీ ఉత్తర భాగం రీ జినల్ రింగ్ రోడ్డుకు అంగీకరిస్తే బిఆర్ఎస్ ప్ర భు త్వం భూ సేకరణ చేయకుండా నిర్లక్ష్యం వ హించిందని మంత్రి కోమటి రెడ్డి నాటి కేసీఆర్ ప్రభు త్వం తీరుపై మండిపడ్డారు. తాను ఎంపీగా ఉ న్నపుడు రైతులకు అన్యాయం జరగకుండా ధ ర్నాలో పాల్గొని,ప్రజా ప్రభుత్వం వచ్చి మంత్రి అయిన తర్వాత మార్కెట్ రేటు ఇప్పించి రైతులను ఒప్పించానన్నారు. తాను మంత్రి అయిన కొత్తలో 6 శాతం భూసేకరణ మాత్రమే అయితే రైతులను ఒప్పించి ఇప్పుడు 98శాతం పైగా పూ ర్తి చేశామని చెప్పారు.

2వ పేజీ లో...

## దామన్న ఆశయ సాధనకు కృషి

- కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆయన చేసిన సేవలు విస్మరించ లేనివి
- రాజకీయాలలో,ప్రజా జీవితంలో ఆయనకు ప్రత్యేక స్థానం
- ఆటుపోట్లను అధిగమించి కాంగ్రెస్ పార్టీ జెండాను రెప రెప లాడించిన ఘనత ఆయనది
- ఆస్తులు కర్పూరంలా కరిగి పోయినా క్యాడర్ ను లీడర్ ను పార్టీనీ కాపడుకున్న నాయకుడు
- 1994 ప్రాంతంలో ఆయన తనకు అందించిన చేయూత ఎప్పటికీ మరువలేను
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి




సూర్యాపేట / తుంగతుర్తి ప్రతినిధి, అక్టోబర్ 04 (సూర్య సేన) : దివంగత కాంగ్రెస్ నేత మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి ఆశయ సాధనకు అవిరళ కృషి చేస్తానని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఇటీవల మరణించిన దివంగత నేత ఆర్. దామోదర్ రెడ్డి అంత్యక్రియల నిమిత్తం ఆయన శనివారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా దివంగత నేత దామన్న పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషి విస్మరించలేనిదని ఆయన కొనియాడారు.

అన్ని రకాల ఆటుపోట్లను అధిగమించి కాంగ్రెస్ జెండాను రెప రెప లాడించిన ఘనత ఆయనకు దక్కిందన్నారు. వ్యాపారదృక్పథంతో రాజకీయాలు నెరుపుతున్న ఈ రోజుల్లో పార్టీని పార్టీ యంత్రాంగాన్ని కాపాడుకునేందుకు సొంత ఆస్తులను కర్పూరంలా కరిగించుకున్న మహానేత దామోదర్ రెడ్డి అని పేర్కొన్నారు.

3వ పేజీ లో...

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలవడం ఖాయం: మంత్రి ప్రభాకర్

హైదరాబాద్, అక్టోబర్, 4 (సూర్యసేన ప్రతినిధి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక లో కాంగ్రెస్ గెలవడం ఖాయమని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఉద్ఘాటించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎన్నికల మాదిరిగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలోనూ అధికార కాంగ్రెస్‌ని గెలిపించాలని కోరారు. సంక్షేమం, అభివృద్ధి జోడెద్దుల మాదిరిగా తమ ప్రభుత్వం పని చేస్తోందని వ్యాఖ్యానించారు. శనివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. ఎర్రగడ్డ డివిజన్‌లో రూ. 2.16 లక్షలతో సీసీ రోడ్లకు, కమ్యూనిటీ హాల్‌కి శంకుస్థాపన చేశామని తెలిపారు మంత్రి పొన్నం ప్రభాకర్. రూ. 54 లక్షలతో మురుగు నీటి కాలువల పునరుద్ధరణకు శంకుస్థాపన చేశామని వెల్లడించారు. దీని పక్కన ఉన్న స్థలంలో ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగపడే విధంగా పార్క్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. రేపటి నుంచి పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు. వాకింగ్ ట్రాక్, పిల్లల గేమ్స్ ఆడుకోవడానికి, తదితర ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. డ్రింకింగ్ వాటర్, శానిటేషన్ ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు మంత్రి పొన్నం ప్రభాకర్. హైదరాబాద్‌లో 60 వేలకు పైగా నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశామని గుర్తుచేశారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ , రూ. 500లకే గ్యాస్ సిలిండర్ అందిస్తున్నామని స్పష్టం చేశారు. కొంత మంది పిల్లలను తీసుకొచ్చి సానుభూతితో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఓట్లు అడగాలని చూస్తున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి మాత్రమే ప్రజలు పట్టం కడతారని ఉద్ఘాటించారు. జూబ్లీహిల్స్‌ని అభివృద్ధి చేసే బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్నారని నొక్కిచెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అధికార కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వాలని కోరారు.



# బిహార్ యువతకు ఈ సారి డబుల్ బొనాంజా : మోడీ

**1వ పేజీ తరువాయి**

ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, బిహార్‌లో నేడు మారుమూల గ్రామాల్లో కూడా పాఠశాలలు ఉన్నాయని, ప్రభుత్వ పాఠశాలలను పునర్నిర్మిస్తూ, ఉన్నత విద్యా సంస్థలను విస్తరిస్తూ, యువకులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తోందన్నారు. ఆర్జేడీ హయాంలో విద్యావకాశాలు లేక ప్రజలు వలసల బాట పట్టేవారని, లెక్కకు మిక్కిలిగా కుటుంబాలు తమ పిల్లలను చదువుల కోసం, పనుల కోసం ఇతర రాష్ట్రాలకు పంపేవారని చెప్పారు. బీహార్ మాజీ ముఖ్యమంత్రి, ఓబీసీల ఆరాధ్యదైవం జననాయక్ కర్పూరి ఠాకూర్ వారసత్వాన్ని ఆపాదించుకునేందుకు కొందరు నేతలు ప్రయత్నిస్తున్నారని, సోషల్ మీడియా ట్రోల్స్‌తో ఎవరూ జన్‌నాయక్‌లు కాలేరని, ప్రజల మనస్సులో స్థిరమైన ముద్ర వేసుకున్న నేతలకే ఆ పేరు చెల్లుతుందని అన్నారు. గత ఏడాది కర్పూరి ఠాకూర్‌కు తమ ప్రభుత్వం భారతరత్న పురస్కారంతో గౌరవించుకుందని, సామాజిక న్యాయం, విద్య ద్వారా సాధికారతకు పాటుపడిన కర్పూరి ఠాకూర్ పేరు చిరస్థాయిగా నిలిపేందుకు బిహార్‌లో జన్ నాయక్ కర్పూర్ ఠాకూర్ స్కిల్ యూనివర్సిటీని ప్రారంభించామని చెప్పారు.

**రూ.62,000 కోట్లతో..**

ఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో పీఎం–సేతు పథకాన్ని ప్రధాని ప్రారంభించారు. ఇది విద్యార్థుల విద్య, నైపుణ్యాభివృద్ధికి తోడ్పడుతుందని చెప్పారు. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా 1,000 ప్రభుత్వ ఐటీఐలను అప్‌గ్రేడ్ చేస్తారు. బిహార్‌లో 'ముఖ్యమంత్రి నిశ్చయ్ స్వయం సహాయతా భట్ట యోజన'ను కూడా ప్రధాని ప్రారంభించారు. ఈ పథకం కింద సుమారు 5 లక్షల మంది గ్రాడ్యుయేట్లకు ఉచిత స్కిల్ ట్రైనింగ్‌తో పాటు రెండేళ్ల పాటు రూ.1,000 చొప్పున అలవెన్స్ ఇస్తారు. రీడిజైన్డ్ బిహార్ స్టూడెంట్ క్రెడిట్ కార్డ్ స్కీమ్‌ను కూడా ప్రధాని ఈ సందర్భంగా ప్రారంభించారు. ఈ పథకం కింద విద్యార్థులకు ఉన్నత విద్యాభ్యాసం కోసం రూ.4 లక్షల వరకూ వడ్డీలేని విద్యా రుణాలు ఇస్తారు.

**ఐదేళ్లలో రెట్టింపు ఉపాధి**

బిహార్ ప్రభుత్వం గత రెండు దశాబ్దాల్లో కల్పించిన ఉద్యోగావకాశాలకు రెట్టింపు ఉద్యోగావకాశాలు రాబోయే ఐదేళ్లలో కల్పించనున్నట్టు ప్రధాని చెప్పారు. ప్రభుత్వం ఇప్పటికే 10 లక్షల శాశ్వత ఉద్యోగాలు, 50 లక్షల మంది యువతకు ఉపాధి కల్పించినట్టు తెలిపారు. బిహార్ ప్రభుత్వం కల్పిస్తున్న పలు పథకాలు, ముఖ్యంగా విద్య, స్కిల్ డవలవ్‌మెంట్ అవకాశాలను యువత ఉపయోగించుకుని తమ జీవితాలను, భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని కోరారు.

# ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్ మారదు

**1వ పేజీ తరువాయి**

4లేన్ల రీజినల్ రింగ్ రోడ్డుపై 2035 నాటికి ట్రాఫిక్ రద్దీ పెరుగుతుందని, భవిష్యత్ అవసరాల దృష్ట్యా 6 లేన్లుగా మార్చుకున్నామని తెలిపారు. సంగారెడ్డి నుండి నర్సాపూర్, తూప్రాన్, గజ్వేల్, జగదేవపూర్ వయా భువనగిరి, చౌటుప్పల్ వరకు 161.518 కిలో మీటర్ల నార్త్ పార్ట్ ఉండనుందని అన్నారు. భూసేకరణ కోసం రూ. 6వేల కోట్లు : భూసేకరణ కోసం 6వేల కోట్లు ఖర్చు అవుతున్నాయని కేంద్రం, రాష్ట్రం చెరిసగం వాటా ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వాటా రూ. 3వేల కోట్లు హడ్కో రుణం తెచ్చామని అన్నారు. ఇప్పటికే పలు మార్లు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిశామని,ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాను కేంద్ర ప్రభుత్వ అధికారులతో సమావేశం అయ్యామని పనులు వేగం చేసేలా మాట్లాడామని చెప్పారు. ఉత్తర భాగం అలైన్‌మెంట్ లో ఎలాంటి మార్పు ఉండదని, జనవరిలో పనులు ప్రారంభిస్తామని ఈ సందర్భంగా మంత్రి స్పష్టం చేశారు. అందుకు కేంద్రం సహకరించాలని మంత్రి కోమటిరెడ్డి కోరారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నపుడు కట్టిన, ఇప్పుడు లక్షన్నర కోట్ల విలువ గల ఓఆర్ఆర్ ను రూ.7వేల కోట్లకు అమ్ముకున్న బిఆర్ఎస్ ప్రభుత్వం రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నదని, చరిత్రలో రోడ్లను అమ్ముకున్న పాపం బిఆర్ఎస్‌ది మాత్రమేనని దుయ్యబట్టారు. రోడ్లు అమ్ముకున్న వాళ్లే అబద్ధపు ప్రచారాలతో రైతులను గందరగోళానికి గురిచేస్తున్నారని, వాళ్ల ట్రాప్ లో పడవద్దని రైతులను కోరారు. వాళ్ళు ఒక్క ఇల్లు కట్టలేదని, రేషన్ కార్డు ఇవ్వలదేని, సన్న బియ్యం ఇవ్వలేదని, ఇంటికి ఉచిత కరెంట్ ఇవ్వలేదు కానీ లక్షల కోట్లు అప్పులు మాత్రం చేశారని ఎద్దేవా చేశారు. నితిన్ గడ్కరీ వ్యక్తిగతంగా తనను ఇష్టపడే వ్యక్తి అని, తన పేరు చెప్పి గౌరెల్లి – భద్రాచలం హైవే , ఎల్బీనగర్ – మల్కాపురం రోడ్డు జీవో ఇచ్చారని గుర్తు చేశారు. హైదరాబాద్ విజయవాడ హైవే 8 లేన్ల నిర్మాణ పనులు వచ్చే ఫిబ్రవరిలో ప్రారంభమవుతాయని మరోమారు స్పష్టం చేశారు.

# ఉగ్రవాదాన్ని ఆపకపోతే సిందూర్–2




**న్యూఢిల్లీ, అక్టోబర్, 4 (సూర్యసేన ప్రతినిధి):** పాకిస్తాన్ ఇక ముందుకూడా టెర్రరిజానికి సహాయం చేయడం నిలిపివేయని పక్షంలో ప్రపంచపటంలో నుంచి కనుమరుగు కావడం ఖా యం అని భారత సైనిక దళాధిపతి జనరల్ ఉ పేంద్ర ద్వివేదీ హెచ్చరించారు. ఆ విషయంలో ఉ పేక్షించే ప్రసక్తే లేదన్నారు. పాకిస్తాన్ భౌగోళికం గా తన స్థానాన్ని నిలుపుకోవాలంటే.. టెర్రరిజా న్ని స్పాన్సర్ చేసే చర్యలకు స్వస్తి చెప్పాలని హెచ్చరించారు. టెర్రరిస్ట్ లకు వారి కార్యకలాపాలకు మద్దతు ఇవ్వడం నిలిపివేయని పక్షంలో ఆపరేషన్ సిందూర్ రెండో విడత మరింత తీవ్రంగా ఉంటుందని,భారతదేశం, సంయమనంతో మౌ నంగా సహించబోదని ఆర్మీ చీఫ్ అన్నారు. రాజస్థాన్‌లోని అనుప్ గఢ్ లోని ఆర్మీ పోస్ట్ లో సైనికదళాలను ఉద్దేశించి ప్రసంగిస్తూ, ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సర్వ సన్నద్ధంగా ఉం డాలని కోరారు. దైవం తలిస్తే.. మీకు మళ్లీ యు ద్ధంలో పాల్గొనే అవకాశం వస్తుంది. మీకు శుభాకాంక్షలు అని జనరల్ ఉపేంద్ర ద్వివేది అన్నారు. మే నెలలో ఆపరేషన్ సిందూర్ సందర్భంగా భారత దళాలు అమెరికా తయారు చేసిన ఎఫ్ –16లు, చైనా కు చెందిన జెఎఫ్ –17తో సహా నాలుగు నుంచి ఐదు పాక్ యుద్ధవిమానాలను కాల్చి వేశాయని ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ ప్రకటించిన తర్వాత జనరల్ ద్వివేదీ ఈ హెచ్చరిక చేశారు. పహల్గాంలో టెర్రరిస్ట్ ల 26 మంది టూరిస్ట్ లను హతమార్చిన ఘటనకు ప్రతిస్పందనగా భారతదేశం ఆపరేషన్ సిందూర్ పేరుతో భారీ సైనిక చర్య చేపట్టడం తెలిసిందే. మే 7న భారతదళాలు తీవ్రంగా క్షిపణులతో విరుచుకుపడి , పాకిస్తాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ లోని తొమ్మిది టెర్రరిస్ట్ శిబిరాలను ధ్వంసం చేశాయి. టెర్రరిస్ట్ శిబిరాలపై దాడి రెండుదేశాల మధ్య దాదాపు యుద్ధ పరిస్థితులకు దారితీసింది. ఆ సమయంలో భారత వైమానిక దళాలు బ్రహ్మోస్ తో సహా పలు క్షిపణులు ప్రయోగించి పాక్ వైమానిక స్థావరాలను నేలమట్టం చేయడమే కాక, పాక్ కు చెందిన ఐదు ఫైటర్ జెట్ విమానాలను, వైమానిక దళ దాడుల హెచ్చరిక వ్యవస్థను కూడా ధ్వంసం చేశాయి. పాకిస్తాన్ కాళ్లా వేళ్లా పడడంతో కాల్పుల విరమణకు ఒప్పందం కుదిరింది. ఆపరేషన్ సిందూర్ సమయంలో భారతదేశం ఏ పాకిస్తానీ పౌరుడికి కానీ, సైనిక లక్ష్యాలను కానీ నాశనం చేయకూడదని నిశ్చయించుకుని కేవలం టెర్రరిస్ట్ స్థావరాలు, శిక్షణా కేంద్రాలతో పాటు వాటి సూత్రధారులను నిర్మూలించడంపైనే దృష్టి పెట్టిందని ఆర్మీచీఫ్ అన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ధ్వంసం చేసిన టెర్రరిస్ట్ స్థావరాలకు సంబంధించిన అన్ని రుజువులను భారతదేశం ప్రపంచం ముందు ప్రదర్శించగలిగిందని, లేని పక్షంలో పాకిస్తాన్ నిజాలను దాచి పెట్టి ఉండేదని ఆయన అన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో ప్రతిభా పాటవాలు ప్రదర్శించిన బిఎస్ ఎఫ్ 140 బెటాలియన్ కమాండెంట్ ప్రభాకర్ సింగ్, రాజ్ పుతానా రైఫిల్స్ మేజర్ రితేష్ కుమార్, హవల్దార్ మోహిత్ గైరాలను ఆర్మీ చీఫ్ స్వయంగా సత్కరించారు.

## పార్టీ ఫిరాయింపు కేసు..

# ఎమ్మెల్యేల క్రాస్ ఎగ్జామినేషన్..





**హైదరాబాద్, అక్టోబర్, 4 (సూర్యసేన ప్రతినిధి):** తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా మారిన ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసులో విచారణలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం చేపట్టిన విచారణ ముగిసింది. విచారణలో భాగంగా పిటిషనర్ల తరఫున అడ్వకేట్లు.. ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డిలను క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. అనంతరం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఎదుట ఎమ్మెల్యేలు తమ వాదనలు వినిపించారు. ఇవాళ ఉదయం నుంచి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చాంబర్లో విచారణ కొనసాగింది. ఈనెల 1వ తేదీన జగరగాల్సిన విచారణ వాయిదా పడటంతో.. ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు నేడు విచారణకు హాజరయ్యారు. బీఆర్ఎస్‌లో గెలిచి పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యలో సుప్రీకోర్టును బీఆర్ఎస్ ఆశ్రయించింది. దీంతో విచారణ చేపట్టిన న్యాయస్థానం స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని గడువు విధించింది. ఈ మేరకు పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నోటీసులు జారీ చేశారు. అయితే దానం నాగేందర్, కడియం శ్రీహరి మినహా మిగిలిన 8 మంది ఎమ్మెల్యేలు తాము పార్టీ మారలేదంటూ వివరణ ఇచ్చారు. ఫిర్యాదుదారులు వారు పార్టీ మారని వారికి వ్యతిరేకంగా ఆధారాలు సమర్పించారు. దీనిలో భాగంగా పార్టీ ఫిరాయింపుల కేసులో ఎమ్మెల్యేల విచారణ కొనసాగుతోంది. ఈ మేరకు ఇవాళ ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డిలు విచారణకు హాజరయ్యారు. కాగా, ఎమ్మెల్యేల విచారణలు ముగిసిన అనంతరం స్పీకర్ ఏ నిర్ణయం తీసుకుంటారు అనేది చర్చనీయాంశంగా మారింది.

## నక్సల్స్‌తో చర్చల్లేవ్.. లొంగిపోండి...

# అమిత్‌షా హెచ్చరిక

**1వ పేజీ తరువాయి**

మళ్లీ చాలా స్పష్టంగా చెబుతున్నా. ఇటు ఛత్తీస్‌గఢ్‌లోనూ, అటు కేంద్రంలోనూ అధికారంలో ఉన్న మా రెండు ప్రభుత్వాలు బస్తర్‌తోపాటు నక్సల్ ప్రభావిత ప్రాంతం మొత్తాన్ని అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నాం' అని అమిత్‌షా అన్నారు. తాము ఎంతో ఆకర్షణీయమైన లొంగుబాటు పాలసీని తెచ్చామని, నక్సల్స్ ఆయుధాలు వీడి లొంగిపోవాలని కోరారు. అలా కాకుండా బస్తర్ ప్రాంతంలో శాంతికి భగం కలిగిస్తే సాయుధ బలగాలు, సీఆర్‌పీఎఫ్, రాష్ట్ర పోలీసులు తీవ్రంగా ప్రతిఘటిస్తాయని హెచ్చరించారు. బస్తర్ ప్రాంత అభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని అమిత్‌షా ప్రశంసించారు. గత పదేళ్లలో ఛత్తీస్‌గఢ్ అభివృద్ధికి రూ.4 లక్షల కోట్లకు పైగా కేంద్రం కేటాయించిందని, రాష్ట్రంలోని గిరిజనుల కోసం పలు పథకాలను బీజేపీ ప్రారంభించిందని చెప్పారు. దేశంలోని 140 కోట్ల మంది ప్రజలు 'స్వదేశీ'కి కట్టుబడితే ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఇండియా నిలుస్తుందని, దీనిని ఎవరూ అడ్డుకోలేరని అమిత్‌షా ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఇటీవల జీఎస్‌టీ రేట్లు తగ్గించడం ద్వారా ఎంతో ఉపశమనం కలిగించారని, స్వదేశీ సంస్కృతికి మనమంతా కట్టుబడితే దేశ ఆర్థిక వ్యవస్థ అత్యున్నత శిఖరాలకు చేరుకుంటుందని తెలిపారు.

# ఆయిల్‌పామ్ పంటలతో... నూనె అవసరాలను తీర్చుకోవచ్చు

**1వ పేజీ తరువాయి**

దేశవ్యాప్తంగా 13 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలుంటే.. ఇందులో తెలుగు రాష్ట్రాల్లోనే 10లక్షల ఎకరాలు ఉండటం గర్వకారణమన్నారు. వచ్చే మూడేళ్లలో మరో 10 లక్షల ఎకరాల్లో ఈ తోటలను విస్తరించి దేశంలోనే నెం.1 స్థాయికి చేరాలనే కృతనిశ్చయంతో రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. ప్రస్తుతం మన దేశంలో ఉత్పత్తి అవుతున్న నూనె దేశీయ అవసరాల్లో 30శాతంగానే ఉందని 70శాతం నూనె ఉత్పత్తులు విదేశాలనుంచి దిగుమతి చేసుకుంటున్నామని తెలిపారు. దేశీయ నూనె అవసరాలను తీర్చేందుకు ఆయిల్‌పామ్ తోటల విస్తరణ ఒక్కటే మార్గమని, అందులో భాగంగానే తెలంగాణలోని 31 జిల్లాల్లో తోటలను విస్తరించేందుకు కేంద్రం అనుమతులు పొందామని పేర్కొన్నారు. రైతులు ఆయిల్‌పామ్ తోటలతో పాటు వక్క, జాజి, ఆవకాడ, మెకాడమియా లాంటి అంతర పంటలు, ఇతర ఉద్యాన పంటలను వేసుకోవడం ద్వారా అత్యధిక అదనపు ఆదాయాన్ని పొందవచ్చని ఆయన వివరించారు. అనంతరం టీఎస్ ఆయిల్ పామ్ ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా దమ్మపేటకు చెందిన ఆలపాటి రామచంద్ర ప్రసాద్‌ను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు.

# సిటీ బస్సు ఛార్జీల పెంపు

**హైదరాబాద్, అక్టోబర్, 4 (సూర్యసేన ప్రతినిధి):** హైదరాబాద్ సికింద్రాబాద్ పరిధిలోని సిటీ బస్సు ఛార్జీలు పెరిగాయి. ఈ నెల 6 నుంచి అదనపు చార్జీలు అమలులోకి రానున్నాయి. ఎలక్ట్రిక్ బస్సుల మౌలిక సదుపాయాల వ్యయాన్ని సమకూర్చుకునేందుకు సిటీ బస్సుల్లో అదనపు ఛార్జీని విధిస్తున్నట్లు ఆర్‌టిసి సంస్థ వెల్లడించింది. ఇందుకు ప్రభుతం ఇదివరకే అనుమతించింది. హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో నడిచే అన్ని బస్సుల్లో అదనపు ఛార్జీని వసూలు చేయనున్నట్లు సంస్థ వెల్లడించింది. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్ప్రెస్, ఈఆర్డినరీ, ఈఎక్స్ప్రెస్ బ స్సుల్లో మొదటి మూడు స్టేజిలకు రూ. 5, 4వ స్టేజి నుంచి రూ.10 అదనపు ఛార్జీని సంస్థ విధించింది. మెట్రో డీలక్స్, ఈమెట్రో ఎసి సర్వీసుల్లో మొదటి స్టేజీకి రూ. 5, రెండో స్టేజీ నుంచి రూ.10 అదనపు ఛార్జీని వసూలు చేయనున్నారు. హైదరాబాద్ భవిష్యత్ బాగు కో సం వాడకలోకి తీసుకువస్తోన్న ఎలక్ట్రిక్ బస్సులను



ప్రజలు ఆదరించాలని, నగర ప్రజా ర వాణా ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చబోతున్న ఈ గ్రీన్ జర్నీలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని ఆర్‌టిసి ప్రజలకు సూచించింది. పర్యావరణహిత కార్యక్రమానికి సహకరించి గతంలో మాదిరిగానే ఆర్‌టిసి సేవలను ప్రోత్సహించాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. హైదరాబాద్ లో కాలుష్యరహిత ప్రజా రవాణా వ్యవస్థను అందుబాటులోకి తేవాలని ప్రభుత్వం నిర్ణయించింది. నగరవాసులను అనారోగ్యానికి గురి చేసే వాయు కాలుష్యాన్ని తగ్గించడం, ట్రాఫిక్ సమస్యకు చెక్ పెట్టేందుకు పర్యావరణ హితమైన ఎలక్ట్రిక్ బస్సులను వినియోగించాలని ప్రభుత్వం ఆర్‌టిసిని ఆదేశించింది. హైదరాబాద్ ఓఆర్ఆర్ లోపల 2027 నాటికి 2800 ఎలక్ట్రిక్ బస్సులను డీజిల్ బస్సుల స్థానే ప్రవేశ పెట్టాలని నిర్దేశించింది. నగరంలోని ప్రజా రవాణా వ్యవస్థను క్లీన్ అండ్ గ్రీన్ దిశగా నడిపించేందుకు ఈ నిర్ణయం ఒక శుభ సంకేతం. పర్యావరణ పరిరక్షణలో ఇది విప్లవాత్మక అడుగుగా సంస్థ భావిస్తోంది. పూర్తి స్థాయిలో 2800 కొత్త ఎలక్ట్రిక్ బస్సులు వినియోగంలోకి వస్తే వ్యక్తిగత వాహనాల కొనుగోళ్లు తగ్గడంతో పాటు ప్రజా రవాణా వినియోగం పెరుగుతోందని, ఫలితంగా వాహనాల నుంచి వెలువడే ఉద్గారాలు తగ్గుతాయని, నగరవాసులకు శ్వాసకోశ సమస్యలు, గుండె జబ్బులు తగ్గి, ప్రజల ఆయుర్ధాయం మెరుగుపడుతుంది భావిస్తోంది. ప్రభుత్వ ఆదేశాలతో 2800 కొత్త ఎలక్ట్రిక్ బస్సులను సమకూర్చుకునేందుకు ఆర్‌టిసి యాజమాన్యం ఇప్పటికే చర్యలు చేపట్టింది. రాబోయే రెండేళ్లలో దశల వారీగా ఎలక్ట్రిక్ బస్సులను వాడకంలోకి తెచ్చేలా ప్రణాళిక రూపొందించింది. ఎలక్ట్రిక్ బస్సులకు అనుగుణంగా మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసుకుంటోంది. ప్రస్తుతం గ్రేటర్ హైదరాబాద్ లో 25 డిపోలున్నాయి. అందులో 6 డిపోల పరిధిలో 265 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తుండగా, ఈ ఏడాదిలో మరో 275 ఎలక్ట్రిక్ బస్సులు అందుబాటులోకి వస్తున్నాయి. ఒక్కో డిపోలో రూ.8 కోట్ల వ్యయంతో పూర్తిస్థాయిలో చార్జింగ్ కోసం హెచ్‌టీ కనెక్షన్లను టిజిఎస్‌పిడిసిఎల్, ట్రాన్‌కో ద్వారా నిర్మించింది. రాబోయే 2800 కొత్త ఎలక్ట్రిక్ బస్సుల కోసం 19 డిపోల్లో చార్జింగ్ కోసం హెచ్‌టీ కనెక్షన్లను సంస్థ ఏర్పాటు చేయనుంది. ఎలక్ట్రిక్ బస్సుల ద్వారా హైదరాబాద్ లో ప్రజా రవాణాను మరింతగా విస్తరించేందుకు కొత్తగా 10 డిపోలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కొత్తగా 10 చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనుంది. ఈ మౌలిక సదుపాయాలకు రానున్న సంవత్సరంలో రూ.392 కోట్ల మేర వ్యయమవుతుందని ఆర్‌టిసి అధికారులు అంచనా వేశారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ఆర్‌టిసి ఈ ఆర్థిక భారాన్ని మోయలేదు. ప్రభుత్వం, ప్రజల సహకారంతో ఈ వ్యవస్థను ముందుకు తీసుకెళ్లాలని కోరుకుంటోంది.

# దుర్మార్గులు రాజకీయాల్లో ఉంటే అభివృద్ధి శూన్యం: చంద్రబాబు



**అమరావతి, అక్టోబర్, 4 (సూర్యసేన ప్రతినిధి):** సాంకేతికతను పేద ప్రజల కోసం ఉపయోగిస్తున్నామని ఏపి సిఎం చంద్రబాబు తెలిపారు. సంపద సృష్టిస్తున్నామని అందరికీ అందిస్తున్నాం అని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. జిఎస్టి–2.0 ద్వారా సూపర్ సేవింగ్స్, దసరా, దీపావళి, సూపర్ సిక్స్, సూపర్ జిఎస్టి అని జిఎస్టి సంస్కరణల ద్వారా ధరలు బాగా తగ్గిపోతున్నాయని తెలియజేశారు. గత ఐదేళ్ల విధ్వంసం తన జీవితంలో చూడలేదని, దుర్మార్గులు రాజకీయాల్లో ఉంటే అభివృద్ధి శూన్యమని మండిపడ్డారు. దుష్ట శక్తులు రాకుండా ప్రజలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని, యూనివర్శల్ హెల్త్ ఇన్సూరెన్స్ తో అందరినీ ఆదుకుంటామని చెప్పారు. పేదల ఆరోగ్యాన్నికాపాడే బాధ్యత తీసుకుంటున్నామని సిఎం పేర్కొన్నారు. రూ. 25 లక్షల వరకు హెల్త్ పాలసీ వర్తించేలా చర్యలు తీసుకుంటున్నామని, కూటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వమని మంచి చేయడమే తన పని అని అన్నారు. దేశంలోనే తొలిసారిగా వాట్సప్ గవర్నెన్స్ తీసుకొచ్చామని, వాట్సప్ గవర్నెన్స్ ద్వారా 750 సేవలు నేరుగా అందిస్తున్నామని చంద్రబాబు స్పష్టం చేశారు.

## స్థానిక సంస్థల ఎన్నికలపై బీజేపీ ఫోకస్..

# అభ్యర్థుల ఎంపికపై కసరత్తు..



**హైదరాబాద్, అక్టోబర్, 4 (సూర్యసేన ప్రతినిధి):** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల వేడి మొదలైంది. ఎన్నికలకు ముహూర్తం దగ్గర పడుతుండటంతో అన్ని పార్టీలు తమతమ కార్యాచరణను రూపొందించుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికలపై బీజేపీ ఫోకస్ పెట్టింది. ఈనెల 9న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుండగా.. అభ్యర్థుల ఎంపికపై కసరత్తు మొదలుపెట్టింది. ఈనెల 5లోగా ప్రతీ స్థానానికి ముగ్గురు పేర్లను ఇవ్వాలని రాష్ట్ర బీజపీ అధ్యక్షుడు రాంచందర్ రావు.. పార్టీ నాయకులను ఆదేశించారు. జట్పీటీసీ అభ్యర్థుల ఎంపిక బాధ్యత రాష్ట్ర కమిటీకే ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. అయితే.. ఎంపీటీసీ అభ్యర్థుల ఎంపిక బాధ్యత జిల్లా పార్టీ కోర్ కమిటీలకు అప్పగించనున్నారు. అలాగే జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు కూడా సమయం దగ్గర పడుతుండటంతో.. అభ్యర్థి ఎంపికపై బీజేపీ కసరత్తు చేస్తోంది. దీని కోసం త్రి మెన్ కమిటీని బీజేపీ ఏర్పాటు చేసింది. ఈ మేరకు జూబ్లీహిల్స్‌లో అభిప్రాయ సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు కమిటీకి ఆదేశాలు జారీ చేశారు. ఈ కమిటీలో మాజీ ఎమ్మెల్యే ధర్మరావు, మాజీ ఎంపీ రాములు, అడ్వకేట్ కోమల ఆంజనేయులుకు చోటు దక్కింది. ఈనెల 9వ తేదీన స్థానిక ఎన్నికలకు నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికపై అన్ని పార్టీలు ఫోకస్ పెట్టాయి.

## బహిరంగ వేలం..

**సూర్యాపేట క్రైమ్, అక్టోబర్ 04 (సూర్య సేన) :** సూర్యాపేట జిల్లా పోలీస్ వాహనాలకు వినియోగించిన బ్యాటరీలు టైర్లు మరియు ఇతర పాత సామాను మరియు పాత జిమ్ సామాను అక్టోబర్ ఆరవ తేదీ సోమవారం ఉదయం 10 గంటలకు జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ పాత ఎస్పీ కార్యాలయం ఇందిరమ్మ కాలనీ నందు బహిరంగ వేలం వేయబడును. కావున వేలంలో పాల్గొనదలచిన వారు నేరుగా ఇందిరమ్మ కాలనీలో గల పాత ఎస్పీ కార్యాలయానికి రాగలరు. వివరాలకు పోలీస్ మోటారు ట్రాన్స్పోర్ట్ అధికారి నీ 8712686019 సంప్రదించవచ్చు.

## ప్రజావాణి రద్దు




**నల్గొండ కలెక్టరేట్, అక్టోబర్ 04 (సూర్య సేన) :** జడ్పిటిసి ,ఎంపిటిసి, గ్రామపంచాయతీ ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్న దృష్ట్యా ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తనా నియమావళి ముగిసిన తర్వాత తిరిగి యధావిధిగా ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆమె స్పష్టం చేశారు. అందువల్ల జిల్లాలోని ప్రజలు ప్రతి సోమవారం ఫిర్యాదులను సమర్పించే నిమిత్తం జిల్లా కలెక్టర్ కార్యాలయానికి రావద్దని విజ్ఞప్తి చేశారు.

## చెడుపై మంచి సాధించిన విజయం దసరా పండగ

**– శ్రీ సేవా ఫౌండేషన్ అధ్యక్షులు మిరుదొడ్డి నరసింహ**

**రంగారెడ్డి, అక్టోబర్ 04 (సూర్యసేన) :** చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి అని శ్రీ సేవపౌండేషన్ అధినేత మిరుదొడ్డినరసింహ అన్నారు. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం వింజమూరు గ్రామంలో జరిగిన విజయదశమి ఉత్సవాల సందర్భంగా జమ్మి చెట్టుకు జమ్మి పూజ చేసి గ్రామస్తులు పరస్పరం అభినందనలుతెలియజేసుకున్నారు. ఈ సందర్భంగామిరుదొడ్డి నరసింహ మాట్లాడుతూ భవిష్యత్తులో జరిగే అన్ని కార్యక్రమాలు ప్రజలంతా కలిసి పంచుకుందామని, గ్రామ అభివృద్ధికి కృషి చేద్దామని అందుకు అమ్మవారి ఆశీస్సులు మనకు ఉండాలని దుర్గా దేవికి పూజ చేసినట్లు తెలిపారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎన్ జగన్, ఎం యాదగిరి, సురేష్. ఎం లక్ష్మణ్, శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## పెద్దపాక సాయమ్మ కి నివాళు లర్పించిన ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి తెలంగాణ సాంస్కృతిక కళాబృందం



**నేలకొండపల్లి, అక్టోబర్ 04 (సూర్య సేన) :** మండలం భైరవునిపల్లి గ్రామానికి చెందిన ఐ.కె.పి %ఎ.ఎ% పెద్దపాక వెంకటేశ్వర్లు మాతృమూర్తి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హాస్పటల్ నందు చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచారు విషయం తెలుసుకున్న ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి. బిఎస్ఐ. ఎం ఈ ఎఫ్. వెంకటేశ్వర్లు స్వగృహమైన భైరవునిపల్లి గ్రామంలో అంత్యక్రియలు కార్యక్రమానికి హాజరై పెద్దపాక. సాయమ్మ .పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగ నివాళులు అర్పించి వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన ఎమ్మార్పీఎస్ నాయకులు ఎమ్మెస్పీ నాయకులు బుద్ధిష్ట సొసైటీ ఆఫ్ ఇండియా నాయకులు తెలంగాణ రాష్ట్ర సాంస్కృతి కళాబృందం ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు కార్యకర్తలు అంతిమయాత్రలో పాల్గొన్నారు.

## వైద్య విద్యలో సీట్ సాధించిన విజేత అక్షర కు సన్మానం



**– మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి**


**సూర్యాపేట టౌన్, అక్టోబర్ 04 (సూర్య సేన) :** సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) మండల కేంద్రానికి చెందిన యాతాకుల అక్షర వైద్య విద్యలో ప్రతిష్ఠాత్మకమైన ఎంబీబీఎస్ సీటు సాధించడం అభినందనీయమని, అక్షర సమాజానికి ఆదర్శం గా నిలవాలని మాజీ మంత్రి సూర్యాపేట శాసన సభ్యులు జగదీశ్వర్ రెడ్డి అన్నారు .తన క్యాంపు కార్యాలయంలో అక్షర ను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ "చక్కగా చదువుకుని తల్లిదండ్రులకు, ఊరికి పేరు తీసుకురావాలని నిరుపేదలకు సేవ చేసి సమాజానికి ఆదర్శంగా నిలవాలన్నారు , ప్రయత్నం చేస్తే ఏ కలనైనా నిజం చేసుకోవచ్చని అక్షర నిరూపించిందన్నారు . గ్రామీణ ప్రాంతాల నుంచే ప్రతిభావంతులైన విద్యార్థులు వెలువడతారనేది ఈ విజయానికి నిదర్శనం" అని ఆయన అన్నారు. కుటుంబానికి, ఊరికీ గర్వకారణంగా నిలిచిందన్నారు. చదువులోనే కాకుండా అక్షర లో ఉన్న వినయశీలత, క్రమశిక్షణ, పట్టుదల ఆమెను ప్రత్యేకంగా నిలబెట్టాయంటూ పెద్దలు సూర్యాపేట మునిసిపల్ మాజీ చైర్మన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ ప్రశంసలు కురిపించారు.

**యాతాకుల మంగమ్మ మనుమరాలుకి మెడికల్ సీట్**

తెలంగాణ చిన్న పత్రికల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అశోక్%-%ఉపేంద్ర దంపతుల కుమార్తెన అక్షర చిన్ననాటి నుంచే చదువులో ప్రతిభ కనబరుస్తూ ముందుకు సాగింది. ఆమె నీట్ పరీక్షలో మంచి స్కోర్ సాధించి ఎస్సి%-%2 కేటగిరీ కింద మల్లారెడ్డి మెడికల్ కళాశాల (సి.ఎం.ఆర్.ఎం.)లో ఎంబీబీఎస్ సీటు పొందింది. గ్రామస్థులు అక్షరను అభినందిస్తూ "మన ఊరి కూతురు వైద్యురాలు అవుతుందనేది గర్వకారణం" అన్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు స్ఫూర్తిదాయకమని అభివర్ణించారు. పట్టుదలతో శ్రమిస్తే ఎలాంటి లక్ష్యమైన సాధ్యమని మరోసారి నిరూపించిందని ప్రశంసించారు. వైద్యురాలిగా మారబోయే ఈ యువతి భవిష్యత్తులో నిరుపేదలకు అండగా నిలిచి, తన ఊరి పేరును రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిష్ఠింపజేస్తుందని అందరూ విశ్వాసం వ్యక్తం చేశారు.

## దామన్న ఆశయ సాధనకు కృషి

- కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆయన చేసిన సేవలు విస్మరించ లేనివి
- రాజకీయాలలో,ప్రజా జీవితంలో ఆయనకు ప్రత్యేక స్థానం
- ఆటుపోట్లను అధిగమించి కాంగ్రెస్ పార్టీ జెండాను రెప రెప లాడించిన ఘనత ఆయనది
- ఆస్తులు కర్పూరంలా కరిగి పోయినా క్యాడర్ ను లీడర్ ను పార్టీనీ కాపడుకున్న నాయకుడు
- 1994 ప్రాంతంలో ఆయన తనకు అందించిన చేయూత ఎప్పటికీ మరువలేను
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



**సూర్యాపేట / తుంగతుర్తి ప్రతినిధి, అక్టోబర్ 04 (సూర్య సేన) :** దివంగత కాంగ్రెస్ నేత మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి ఆశయ సాధనకు అవిరళ కృషి చేస్తానని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఇటీవల మరణించిన దివంగత నేత ఆర్. దామోదర్ రెడ్డి అంత్యక్రియల నిమిత్తం ఆయన శనివారం సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా దివంగత నేత దామన్న పార్థివ దేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషి విస్మరించలేనిదని ఆయన కొనియాడారు. అన్ని రకాల ఆటుపోట్లను అధిగమించి కాంగ్రెస్ జెండాను రెప రెప లాడించిన ఘనత ఆయనకు దక్కిందన్నారు. వ్యాపారదృక్పథంతో రాజకీయాలు నెరపుతున్న ఈ రోజుల్లో పార్టీని పార్టీ యంత్రాంగాన్ని కాపాడుకునేందుకు సొంత ఆస్తులను కర్పూరంలా కరిగించుకున్న మహానేత దామోదర్ రెడ్డి అని పేర్కొన్నారు. రాజకీయాలతో పాటు ప్రజాజీవితంలో ఆయనది ప్రత్యేక స్థానమన్నారు. తాను తొలిసారి 1994 ప్రాంతంలో శాసనసభ్యుడిగా ఓటమి చవి చూసినప్పుడు ఆనాటి తెలుగుదేశం, సిపిఎం వామపక్షాలు కోదాడ నియోజకవర్గం లో హింసాత్మక సంఘటనలతో పెట్రేగి పోతున్న తరుణంలో దివంగత దామోదర్ రెడ్డి అందించిన చేయూతను ఎప్పటికీ మరచి పోలేమన్నారు. అటువంటి మహానేత మననుండి నిష్క్రమించడం జీర్ణించుకోలేక పోతున్నామన్నారు. దివంగత నేత ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూనే ఆయన ఆశయాలు ముందుకు తీసుకు పోయేందుకు సహచర మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, స్థానిక శాసనసభ్యులు, లోకసభ సభ్యులు పార్టీ యంత్రాంగంతో కలసి పనిచేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. పార్థివ దేహానికి నివాళులర్పించిన టిపిసిసి రాష్ట్ర అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామిల్, కుందూర్ రఘువీర్ రెడ్డి, బాలు నాయక్, చెవిటి వెంకన్న తదితరులు ఉన్నారు.

## – మాజీ మంత్రి దామోదర్ రెడ్డి కి ఘనంగా నివాళులు అర్పించిన ప్రముఖులు





**– శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

దివంగత మాజీ మంత్రివర్యులు రాంరెడ్డి దామోదర్ రెడ్డి అంత్యక్రియలు శనివారం సూర్యాపేట జిల్లా, తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రంలోని దామోదర్ రెడ్డి వ్యవసాయ క్షేత్రంలో ప్రభుత్వ లాంఛనాలతో జరిగాయి. మంత్రులు, ప్రముఖులు నాయకులు పార్టీలకతీతంగా పెద్ద ఎత్తున తరలి వచ్చి దివంగత నేతకు శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఘన నివాళులర్పించారు. ప్రజల కడసారి సందర్శనార్థం రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి పార్థివ దేహాన్ని తుంగతుర్తి లోని వారి వ్యవసాయ క్షేత్రం లో ఉంచారు. రాష్ట్ర శాసనమండలి



చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,రాష్ట్ర నీటిపారుదల పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి,రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ,మైనార్టీ, వృద్ధులు,వికలాంగుల సంక్షేమ శాఖ, ఇన్చార్జి మంత్రివర్యులు అడ్లురు లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ లు దివంగత నేత దామోదర్ రెడ్డి పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.దామోదర్ రెడ్డి కుమారుడు సర్వోత్తమ్ రెడ్డిని, కుటుంబ సభ్యులను ఓదార్చారు. రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, పర్యాటక సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి

ఎంపీ రఘు వీర్ రెడ్డి,ఎమ్మెల్యేలు మందుల సామేలు, ఉత్తమ్ పద్మావతి రెడ్డి, జగదీశ్ రెడ్డి, బి లక్ష్మారెడ్డి , అనిల్ కుమార్ రెడ్డి, వేముల వీరేశం, యశస్విని రెడ్డి,ఎమ్మెల్సీ శంకర్ నాయక్, అగ్రికల్చర్ కమిషన్ మెంబర్లు రాంరెడ్డి గోపాల్ రెడ్డి,చెవిటి వెంకన్న యాదవ్, మాజీ ఎంపీ హనుమంతరావు,మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్,ఇతర ప్రముఖులు రాంరెడ్డి దామోదర్ రెడ్డి పార్థివ దేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి నివాళులర్పించారు. తమ దివంగత నేత ను చివరి చూపు చూసేందుకు ప్రజలు, అభిమానులు తండోపతండాలుగా వచ్చి నివాళులు అర్పించారు. అనంతరం అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. నివాళులు అర్పించిన వారిలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్, ఎస్ పి కే నరసింహ, ఆర్డీఓ వేణుమాధవ్ తదితరులు ఉన్నారు.









## ఉచిత కంటి వైద్య శిబిరం

**భానుపురి, అక్టోబర్ 04 (సూర్య సేన) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వరిటైర్డ్ ఉద్యోగుల సంఘం సూర్యాపేట జిల్లా కార్యాలయములో రేపు (సోమవారం) మ్యాక్సీ శరత్ లేజర్ కంటి హాస్పిటల్ వరంగల్ వారిచే ఉదయం 10.00 నుండి 1.00 వరకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్న వారికి ఉచితముగా ఆపరేషన్ చేస్తారు. కావున పెన్షనర్స్ ,ప్రభుత్వ రెగ్యులర్ ఉద్యోగులు ,ఆరోగ్య శ్రీ కార్డు గలవారు ,జర్నలిస్టులు ఇట్టి అవకాశమును వినయోగించు కోగలరని సంఘ అధ్యక్ష,కార్యదర్శి లు దండ శ్యామ్ సుందర్ రెడ్డి ,సుధ గాని నాగేశ్వర్ రావు లు శనివారం ఒక ప్రకటనలో కోరినారు.

## సాధారణ ప్రసవాలు పెంచాలి







**తుంగతుర్తి / అర్వపల్లి, అక్టోబర్ 04 (సూర్య సేన) :** ప్రభుత్వ ఆస్పత్రులలో సాధారణ ప్రసవాలు పెంచేలా చూడాలని, ఈ విషయంలో గర్భిణీలకు సైతం అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. శనివారం ఆయన అర్వపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా తనిఖీ చేశారు. ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.పి హెచ్ సి ద్వారా ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవల గురించి డాక్టర్ భూక్య నగేష్ నాయక్ ను అడిగి తెలుసుకున్నారు. తదుపరి రిజిస్టర్స్, రికార్డ్ లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీకాంత్, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

## ప్రదానమంత్రి నరేంద్రమోడీ చేతుల మీదుగా తాళ్లూరి పల్లవి కి అవార్డు ప్రధానం



**ఖమ్మం రూరల్, అక్టోబర్ 04 (సూర్య సేన) :** ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్ ప్రోగ్రామింగ్ అసిస్టెంట్ విభాగంలో అవార్డును అందుకున్నారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్లో జరిగిన కౌశల్ దీక్షాంత్ సమరోహ్లో ప్రధాని యువతలో స్కిల్ డెవలప్మెంట్ ఉద్యోగ నైపుణ్యాల్ని పెంచేందుకు ప్రధాన మంత్రి సేతు (పీఎం –సెట్) పథకాన్ని రూ. 60,000 కోట్లతో ప్రవేశపెట్టారు. దీనిలో బాగంగానే అత్యుత్తమ నైపుణ్యం కనపరిచిన పలు రాష్ట్రాలకు చెందిన విద్యార్డులకు అవార్డులను ప్రదానం చేశారు దీనిలో బాగంగానే ఆర్టిపిషియల్ ఇంటలీజెన్స్ విభాగంలో ఆల్ ఇండియా ట్రేడ్ టాపర్ గా ఎన్నికైన తాళ్లూరి పల్లవికి ప్రదాని చేతుల మీదుగా అవార్డును ప్రదానం చేశారు. ఈసందర్భంగా పల్లవి తల్లిదండ్రులు తాళ్లూరి రవి, అజిత అనందం వ్యక్తం చేశారు.

## ప్రతిభా పురస్కారానికి ఎంపికైన డాక్టర్ లక్ష్మీ సరోజా

**– విశ్వ జనని ఫౌండేషన్ అధినేత బొగ్గారపు బ్రహ్మానందం**

**రంగారెడ్డి, అక్టోబర్ 04 (సూర్యసేన) :** ప్రతి సంవత్సరం ప్రతిభా పురస్కారాలు ఇస్తూ ఎంతో మంది తమ తమ రంగాలలో రాణిస్తున్న వారిని ప్రోత్సహిస్తు అవార్డులు అందజేస్తూ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ విశ్వజనని ఫౌండేషన్ ప్రతి సంవత్సరం అవార్డులు అందజేస్తుందని అందులో భాగంగా, సమాజ సేవకురాలు జేజే ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు లక్నో కుచెందిన డాక్టర్ లక్ష్మీ సరోజా కి విశ్వ జనని లేడీ లెజెండరీ అవార్డు అందజేయడం ఆనందంగా ఉందని బోగ్గారపు బ్రహ్మానందం అన్నారు. వచ్చే నవంబర్ ఒకటో తేదీన సురవరం ప్రతాపరెడ్డి పొట్టి శ్రీరాములు తెలంగాణ యూనివర్సిటీలో ఈ అవార్డులు అందజేసేందుకు



ప్రముఖ సినీ నటులు, రాజకీయ నాయకులు విచ్చేస్తున్నారనిబ్రహ్మానందం తెలిపారు ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మీ సరోజా మా ప్రతినిధితో మాట్లాడుతూ, తన గురించిన తమ సూర్య సేన దినపత్రిక లో నన్ను పరిచయం చేస్తున్నందుకు అభినందనలు తెలిపారు.

## సంపాదకీయం

ఆదివారం, అక్టోబర్ 5, 2025

# పండుగలతో పబ్బం గడుపుతున్న ప్రభుత్వాలు

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దాదాపు ప్రజలందరినీ పండుగలు పేరుతో మతం మత్తులో ముంచితేలిస్తున్నాయి. సహజంగా దేశంలో ప్రజలకు దైవభక్తి ఎక్కువ. దీనిని ఆసరాగా చేసుకుని భారత రాజ్యాంగం ప్రకారం ప్రమాణం చేసిన పాలకులు, ఆ ప్రమాణాలను, రాజ్యాంగ లక్ష్యాలను పక్కన బెట్టి, సెక్యులర్ అనే భావన పాటించకుండా ప్రత్యక్షంగా, పరోక్షంగా అనేక మత క్రతువుల్లో పాల్గొంటూ, ప్రజలను కూడా వీటిలో భాగస్వామ్యం చేయడం జరుగుతున్నది. దీంతో దేశం లో తాండవిస్తున్న నిరుద్యోగం, అధిక ధరలు, ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణ, మానవ అభివృద్ధి వంటి అంశాలు పక్కదోవపట్టిస్తూ ప్రజలను మభ్యపెడుతున్నారు. ప్రజలు కూడా ఇటువంటి అంశాలను సీరియస్‌గా ఆలోచించకుండా పండుగలు జరుపుకుంటూ కాలం వెల్లబుచ్చుతున్నారు. ఈ మత మైకంలో వాస్తవ పరిస్థితిని అర్థం చేసుకోకలేకపోవడం బాధాకరం. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి దాదాపు 78 సంవత్సరాలు పూర్తి చేసుకున్నా, నేటికీ మన అక్షరాస్యత 74% శాతంగా ఉంది. ఇది కూడా కేవలం సంతకాలు చేసిన వారిని కలుపుకుంటే... లేదంటే అరవై శాతంలోపే... దీని వల్ల ప్రజల్లో చైతన్యం, అవగాహన లేకపోవడం వల్ల అసలు సమస్యలు, దేశంలో తాండవిస్తున్న నిరుద్యోగం, అధిక ధరలు వంటి అంశాలు అర్థం చేసుకోలేకపోవడంతో పాలకులుచెప్పే మాటల గారడీలో పడిపోతున్నారు. అందుచేతనే వారి జీవితాలు అన్ని రకాలుగా అంతంత మాత్రంగానే ఉన్నాయి.. నేటికీ దాదాపు సగం జనాభా ప్రభుత్వాలు ఇచ్చే పెన్షన్ పథకం, సంక్షేమ పథకాలు, ఉచిత పథకాల మీదే ఆధారపడి జీవిస్తున్నారు. ప్రపంచంలో ఎక్కడా లేని వివిధ రకాల పండుగలు దేశంలో ఉన్నాయి. పూర్వం కాలంలో మామూలుగా పండుగ కార్యక్రమాలు జరుపుకుని, వారి దైనందిన జీవితంలో మునిగిపోయే వారు. కానీ నేడు పండుగలను 'పెద్ద పెద్ద ఈవెంట్స్' లాగా ప్రభుత్వాలే జరపటం ఆశ్చర్యం వేస్తుంది. పుష్కరాలు అని, పౌర్ణమి అని, ఉత్సవాలు అని భారీ ఎత్తున, రోజులు తరబడి చేయడం జరుగుతుంది.కొద్ది మొత్తంలో ప్రభుత్వాలు ఖర్చు చేసి, భారీ ఎత్తున ప్రజల నుంచి ఆదాయం సమకూర్చుకోవడం జరుగుతుంది. అనగా భక్తిని 'వ్యాపారం' గా మార్చివేసారు. ప్రజలు నుంచి కొన్ని కోట్ల రూపాయలు దండుకుంటున్నారు. దేవస్థానాలు, ట్రస్టులు, ప్రభుత్వాలు, వ్యాపార సంస్థలు భారీగా ఆర్థికంగా బలపడుతున్న పరిస్థితి. నేటి ప్రభుత్వాలు ప్రజలకు కావలసిన విద్య, వైద్యం, కనీస అవసరాలు తీర్చుడం మానేసి, ప్రజలను మభ్యపెట్టే మత క్రతువుల్లో పాల్గొనేటట్లు ప్రోత్సాహిస్తున్నాయి. అసలు ఈ ఆధునిక కాలంలో ప్రపంచ దేశాలతో పోలిస్తే వివిధ రంగాల్లో అనగా అక్షరాస్యత, ఆరోగ్యం, ఉద్యోగ, ఉపాధి విషయంలో, సంతోష సూచిలో, మానవ అభివృద్ధి సూచికల్లో మనం ఎక్కడ ఉన్నాం అని ప్రశ్నించుకుని ప్రభుత్వాలు పనిచేయాలి. కొంతమంది చేతిలోనే దేశసంపద కేంద్రీకృతమై, కొద్దిమంది బిలియనీర్ల సంపద పెరుగుదలచూసి దేశం త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ మారుతుంది అని మురిసి పోవడం చాలా హాస్యాస్పదంగా ఉంది. ఎందుచేతనంటే దాదాపు సగం జనాభా ప్రభుత్వాలు ఇచ్చే ఉచిత, సంక్షేమ పథకాలతోనే జీవితాలు గడుపుతున్నారు. ఫిన్లాండ్, స్వీడన్, నార్వే వంటి దేశాలను దృష్టిలో ఉంచుకుని మన దేశాన్ని నడిపించాలి. వలసలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలి. అవినీతిని నిర్మూలించాలి. దక్షిణ కొరియా, జపాన్, చైనా, క్యూబా వంటి దేశాలు ఉత్పత్తి రంగంలో ఎలా అభివృద్ధి చెందుతున్నయో చూసి దేశంలో అమలు చేయాలి. నైపుణ్యాభివృద్ధికి పెద్ద పీటవేయాలి. శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలి. 'ఆత్మనిర్భర్ భారత్, మేక్ఇన్ ఇండియా' అనే కార్యక్రమాలు మొదలు పెట్టి దాదాపు దశాబ్దం కాలం గడిచినా ఏ మేరకు ఆ లక్ష్యం చేరేమో ఈ ప్రభుత్వాలు పునఃసమీక్ష చేసారా! ఇటువంటి అంశాలపై దృష్టి సారించడం మానివేసి, కేవలం మత క్రతువులకు ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యత ఇస్తే ఎలా! ఎప్పటికి మన దేశం 'వికసిత భారత్' అవుతుంది...!? ప్రపంచ దేశాలు అన్ని శాస్త్ర, సాంకేతిక రంగాల్లో దూసుకుపోతుంటే మన విద్యాలయాల్లో తిరిగి వాస్తు, జ్యోతిష్యం, మతపరమైన అంశాలు వంటివి ప్రవేశపెడుతుంటే, ఇక మన విద్యార్థులు అంతర్జాతీయ విద్యార్థిగా ఎలా మారతాడో ప్రభుత్వాలు చెప్పాలి. ఇకనైనా ప్రభుత్వాలు ప్రజలను మభ్యపెట్టే కార్యక్రమాలు విడనాడాలి. ప్రజల తలసరి ఆదాయం పెరగడానికి, ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపరచడానికి తగు చర్యలు తీసుకోవాలి. ప్రైవేటీకరణ, కార్పొరేటీకరణకు స్వస్తి పలకాలి. ప్రభుత్వాలు ఇకనైనా పటిష్ట చర్యలు తీసుకోవాలి. అప్పుడు మాత్రమే నిజమైన వికసిత భారత్‌గా ఉంటుంది.

సూర్యసేన

దినపత్రికలో
అన్ని రకాల ప్రకటనలు
అడ్వర్టైజ్మెంట్స్ మరియు
వార్తల కోసం

సంప్రదించండి: 9951241048

# బీహార్‌లో కులం కార్డే కీలక పాత్ర



బీహార్ ఓటర్ల జాబితా వివాదం మధ్య, కొన్ని రోజుల్లోనే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు తమ ఎన్నికల వ్యూహాలను మెరుగుపరుచుకుంటున్నాయి. కానీ యథాప్రకారం అభ్యర్థుల ఎంపికలో కులం కార్డే కేంద్ర బిందువు అవుతుంది. ఏదైనా ఎన్నికల్లో రెండు విధాలుగా ఓటర్లను ప్రలోభపరచవలసి ఉంటుంది. ఐదేళ్ల క్రితం లాలూప్రసాద్ అప్పటి ఎన్నికలను అగ్డా (అగ్ర వర్గాలు), పిచ్చడా (వెనుకబడిన వర్గాలు) మధ్య పోరాటంగా అభివర్ణించారు. బిజెపిని సంప్రదాయ అగ్రకులాల, ఉన్నత వర్గాల పార్టీగా ప్రకటించారు. 2024లో 'ఇండియా కూటమి' కూడా రెండు విధాలుగా ప్రచారాన్ని ముందుకు సాగించాలని ఆకాంక్షించింది. వెనుకబడిన వర్గాలపైనే దృష్టిపెట్టి మరింత సంరక్షణ వారికి అవసరమని ప్రచారం సాగించింది. బీహార్‌లో వెనుకబడిన వర్గాల సమీకరణకు సుదీర్ఘ చరిత్ర ఉంది. వలస కాలంనుంచే ఈ తరహా ఉద్యమాలు మొదలయ్యాయి. ఇవి రాజకీయంగా వెనుకబడిన వర్గాలకు అధికారాన్ని కట్టబెట్టాయి. ఈ వెనుకబడిన వర్గాల సమీకరణే ఎన్నికల పోటీకి సాధనంగా ఉపయోగపడుతుంది. ఉన్నతవర్గాలు, తక్కువస్థాయి వర్గాలు అన్న తేడాయే విచక్షణకు దారితీస్తుంది. ఏదెలాగున్నా పొత్తులు, ప్రతిపొత్తుల ఆట, మొత్తంమీద పార్టీ వ్యవస్థలో రాజకీయ చీలికలు ఈ రెండు కోణాల దృష్టిని నిత్యం క్లిష్టం చేస్తున్నాయి. చారిత్రకంగా చూస్తే బిజెపి అభ్యర్థుల ఎంపిక ఉన్నత కులాల అనుకూలంగానే ఉంటుంది. 2020 లో బిజెపి 74 మంది ఎంఎల్ఎల్లో 33 మంది (40%) ఉన్నత కులాల వారే. అలాగే ఎక్కడా బిజెపి ముస్లిం అభ్యర్థులను ఎంపిక చేయదు. అంటే దీని అర్థం మిగతా అభ్యర్థులు ఒబిసి(26), ఇబిసి(2) నుంచి ఎంపిక చేసిన వారే. దీనికి విరుద్ధంగా జెడియు 43 మంది ఎంఎల్ఎల్లో 22 మంది ఒబిసి, ఇబిసిలకు చెందినప్పటికీ కేవలం 10 మంది మాత్రమే ఉన్నత కులాల వారు ఉన్నారు. చాలామంది జెడియు ఎంఎల్ఎల్లో ఏడుగురు కుర్మీలు, నలుగురు యాదవులతో కలుపుకుని స్థానిక ప్రాధాన్యం కలిగిన ఒబిసి గ్రూపులకు చెందినవారే. మరోవైపు ఆర్‌జెడి నిర్మొహమాటంగా పూర్తిగా యాదవులకే అనుకూలంగా ఉంటుంది. 2020లో ఆర్‌జెడి అవకాశం ఉన్నంత వరకు సీట్ల సర్దుబాటు ఒప్పందాన్ని సద్వినియోగం చేసుకుంది. 44 సీట్లలో 26ను గెలుచుకుంది. బిజెపి, జెడియుకు భిన్నంగా ఆర్‌జెడి ముస్లిం అభ్యర్థులను నియమించింది. కాంగ్రెస్ కూడా అలాగే చేసింది. వాస్తవానికి ప్రధాన పార్టీలన్నిటిలో కాంగ్రెస్ లోనే ముస్లిం ఎంఎల్ఎల జనాభా ఎక్కువ. కానీ అది కూడా బీహార్‌లో అతిచిన్న నాలుగు పార్టీల్లో ఒకటిగా మిగిలిపోతుంది. 2000 సంవత్సరం మొదట్లో లాలూ తగ్గిపోవడంతో కుర్మీలు/ కుష్వాహాలు, మరికొంతమంది ఇబిసిలతోపాటు యాదవేతర ఒబిసిల ప్రాతినిధ్యానికి చోటు లభించింది. 2020లో తొమ్మిది వేర్వేరు గ్రూపులనుంచి వైవిధ్యంగా 28మంది ఒబిసి ఎంఎల్ఎలను ఎంచుకుంది. వీరిలో చాలావరకు బనియాలు, యాదవులు కూడా ఉన్నారు. బిజెపి, జెడియు లేదా ఆర్‌జెడి ఏదైనా ఎన్నికైన ఒబిసి ఎంఎల్ఎల్లో మెజార్టీ స్థానిక ప్రాధాన్యం కలిగిన సామాజిక వర్గాలవారే ఎంపికయ్యారు. ఇబిసిలు ప్రచార వాక్చాతుర్యానికి కేంద్రబిందువే అయినప్పటికీ, చాలావరకు మినహాయింపబడ్డారు. బీహార్ జనాభాలో ఇబిసిలు దాదాపు 36 శాతం నుంచి 40 శాతం ఉన్నప్పటికీ, 2020 అసెంబ్లీలో వారి ప్రాతినిధ్యం కేవలం 11 శాతానికి పరిమితమైంది. చాలా పార్టీలు తమ టికెట్ల పంపిణీలో వైవిధ్యం చూపించినప్పటికీ ఫలితాలలో పెద్ద చీలిక కనిపించింది. తీవ్రమైన కుల విభజనే కీలకమవుతోంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లో 22 శాతం ఓట్లతో ఆర్‌జెడి అతిపెద్ద పార్టీగా తెరపైకి వచ్చింది. 2014 నుంచి హిందీ బెల్టులో బిజెపి ఆధిపత్యం వహిస్తున్నా ఓట్లలో అయిదోవంతు మాత్రమే పొందగలిగింది. అభ్యర్థుల ఎంపికలో వైవిధ్యం చూపించాలని బిజెపి కాంక్షిస్తున్నా, అధికారంలో ఉండడానికి మిత్రవర్గాల పొత్తుపైనే ఆధారపడవలసి వస్తోంది. ముఖ్యంగా దాని ప్రధాన మిత్రపక్షం జెడియు తన జాతి మతపరమైన జాతీయవాద భాగాన్ని పంచకుండా ఇప్పటికీ సెక్యులర్‌శక్తిగా తన అస్తిత్వాన్ని ప్రదర్శిస్తోంది. కులాల చీలిక, వెనుకబడిన వర్గాల సుదీర్ఘ చారిత్రక ప్రభావం బిజెపి హిందుత్వవాదాన్ని అడ్డుకుంటున్నాయి. సామాజిక, ఎన్నికల పొత్తుల నిర్మాణానికే మొగ్గుచూపుతున్నాయి. యోగి ఆదిత్యనాథ్ వంటి చరిష్మా కలిగిన హిందుత్వరాజకీయ నేత లేకపోవడం కూడా బిజెపికి మైనస్ పాయింటే. మతపరమైన కేంద్రీకరణ బీహార్‌లో చాలా తక్కువ ప్రభావం చూపుతుంది. రానున్న అసెంబ్లీ ఎన్నికల ముఖ చిత్రాన్ని పరిశీలిస్తే బీహార్ రాజకీయ వ్యాకరణ మౌలిక స్వరూపం మారే అవకాశం లేదు. 2023లో నితీశ్‌కుమార్ నిర్వహించిన కులాల గణన బట్టి బీహార్ రాజకీయాల్లో కులమే ప్రధాన బలమైన పునాదిగా వెల్లడవుతోంది. అయితే ఈసారి రెండు కోణాలనుంచి అత్యంత ముఖ్యమైన అనిశ్చితి పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎన్నికల కమిషన్ నిర్వహించిన ఓటర్ల జాబితాపై సమగ్ర సర్వే ఒకటి కాగా, మరొకటి ప్రశాంత్ కిశోర్ 'జనసూరజ్' ప్రచారం. పంజాబ్‌లో స్థానిక ఉన్నత వర్గాలను తిరస్కరించి ఓటర్లు బయటనుంచి వచ్చిన ఆమ్‌ఆద్మీపార్టీకి ఎలాగైతే పట్టం కట్టారో అలాగే బీహార్‌లో కూడా జరుగుతుందని ప్రశాంత్ కిశోర్ భవిష్యత్ రాజకీయ అంచనాలు వేస్తున్నారు. కానీ బీహార్ పంజాబ్‌లా కాదు. ఇక్కడ కులం అన్నది చాలా లోతుగా వేళ్లూనుకుంది. కిశోర్ స్వంత వ్యూహం కూడా కులం గణాంకాలను ప్రతిబింబిస్తోంది. ఆయన ప్రచారం కూడా సంప్రదాయ కుల స్వరంపైనే ఆధారపడుతోంది. ఏ పార్టీకి ఫలితాలు ఎలా వస్తాయో చెప్పలేకపోయినా ఇప్పుడు అనిశ్చితి మాత్రం వెంటాడుతోంది.

# జనాలను కూడగట్టి..వారి ప్రాణాలనే పణంపెట్టి!

కోట్లాదిమంది తమిళ ప్రజల ఆరాధ్య నటుడు, తమిళగ వెట్రి కళగం పేరిట కొత్తగా ఒక రాజకీయ పార్టీని ప్రారంభించి అధికారాన్ని హస్తగతం చేసుకోవాలని ఉవ్విళ్ళూరుతున్న విజయ్‌కి నాయకత్వ లక్షణాలు లేవని మద్రాస్ హైకోర్టు వ్యాఖ్యానించింది. ఆయన దర్శనంకోసం ప్రాణాల్ని కూడా లెక్క చేయకుండా లక్షలాదిగా జనం వస్తుంటే హైకోర్టు ఏమిటి ఇలా వ్యాఖ్యానించింది? ఇటీవల విజయ్ తమిళనాడులోని కరూర్‌లో నిర్వహించిన ఒక రాజకీయ ర్యాలీలో జరిగిన తొక్కిసలాట కారణంగా 40మందికి పైగా మరణించడం, ఎంతోమంది గాయాలపాలు కావడం తెలిసిందే. ఇటువంటి సమావేశాలపై ఆంక్షలు విధించాలంటూ దాఖలైన ఒక పిటిషన్ మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సెంథిల్ కుమార్ ఎదుట విచారణకు వచ్చినప్పుడు ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఘటన జరిగిన వెంటనే ఈ సభ నిర్వహించిన పార్టీ నాయకులందరూ అక్కడినుంచి వెళ్లిపోవడం, ఆ సమయంలో మిగతా పార్టీలవారు సహాయక చర్యలు చేపట్టడం, నిర్వాహకులు ఏమీ పట్టనట్టుగా ఉండటం విజయ్ నాయకత్వ లోపాన్ని స్పష్టం చేస్తున్నదని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. సరే, ఈ పిటిషన్లు దాఖలు చేసినవారిలో కొందరు న్యాయవాదులు కూడా ఉన్నట్టున్నారు. అసలు విజయ్ ప్రారంభించిన తమిళగ వెట్రి కళగం పార్టీ గుర్తింపును రద్దు చేయాలనడంతోపాటు వారు కోర్టుని మరికొన్ని కోరికలు కోరారు. ఇటువంటి సంఘటనలు జరిగిన వెంటనే రాజకీయ పార్టీలను రద్దు చేయడం, సంస్థలను రద్దు చేయడం, ప్రభుత్వాలను అధికారంలోంచి దించేయడం నిజంగా జరిగితే ఇప్పటివరకు స్వతంత్ర భారతదేశంలో రాజకీయ కుంభమేళాలు, మత సంబంధమైన కుంభమేళాల్లో ఇప్పటిదాకా జరిగిన సంఘటనల కారణంగా పలు పార్టీలు రద్దయి ఉండేవి. పలు ప్రభుత్వాలు కూలిపోయేవి. పలు సంస్థలు మూతపడవలసి ఉండేవి. భారత ప్రజాస్వామ్యంలో ఇవాళ జరిగిన సంఘటనను మరునాడు మర్చిపోవడం మన అలవాటు చేసుకున్నాం కదా. గతంలో జరిగిన వాటన్నిటి మాదిరిగానే కరూర్ తొక్కిసలాటలో చనిపోయినవారి కుటుంబాలు మినహా మిగతా ప్రపంచం ఆ దుర్ఘటన గురించి మరిచిపోతుంది.

రాజకీయ కుంభమేళాలు అన్నప్పుడు భారతదేశంలో జరిగిన కుంభమేళాల సందర్భంగా జరిగిన దుర్ఘటనల్లో చనిపోయిన అసంఖ్యాకులు గుర్తొస్తారు. అవి రాజకీయ మేళాలైనా, ధార్మిక కుంభమేళాలైన ఒక్క అమాయక ప్రాణం కూడా పోని విధంగా జాగ్రత్తలు తీసుకోగలిగితేనే వాటిని నిర్వహించాలన్న స్పృహతో పాటు కఠినమైన చట్టాలు ఉంటే తప్ప ఇలా జననష్టం ముందుముందు కూడా జరుగుతుంది. ఇప్పటికి చాలాసార్లు మనం మాట్లాడుకున్నాం, అయినా చట్టాలు చేసేవారిలో కదలిక అయితే కనిపించడంలేదు. ముందుగా మత సంబంధమైన కుంభమేళాల గురించి లేదా ధార్మిక కుంభమేళాల గురించి మాట్లాడుకుంటే ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డిఎ ప్రభుత్వ అధినేత నరేంద్ర మోడీ, ఆయన ప్రభుత్వంలోని ఇతర మంత్రులు పొద్దున లేస్తే భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూని పనికిరానివాడని, ఆయన దేశానికి ఏమీ చేయలేదని విమర్శించిన మాటలు గుర్తొస్తాయి. నెహ్రూ ప్రధానిగా ఉన్న కాలంలో 1954నాటి కుంభమేళాలో తొక్కిసలాట జరిగి 800 మంది చనిపోతే నెహ్రూ ఆ సంఖ్యని దాచే ప్రయత్నం చేయకుండా ఒక సలహా ఇచ్చారు.



అదేమిటంటే, రాజకీయ నాయకులు, విఐపిలు ఇటువంటి సందర్భాలలో ఆ ప్రాంతాలకు వెళ్లకుండా ఉండాలని. ఆ తర్వాత పలుమార్లు నెహ్రూ తర్వాత కూడా జరిగిన కుంభమేళాల్లో పలు కారణాల వల్ల తొక్కిసలాటలు జరుగుతూనే ఉన్నాయి. జనాలు చనిపోతూనే ఉన్నారు. 1986లో హరిద్వార్ కుంభమేళాలో 50 మంది చనిపోయారు. 1992 ఉజ్జయిని సింహస్త కుంభమేళాలో 50 మంది, 2003 నాసిక్ కుంభమేళాలో 30 మంది మృతి చెందారు. నాసిక్‌లో వందమందికి పైగా గాయపడ్డారు కూడా. 2010లో హరిద్వార్ కుంభమేళాలో అయిదుగురు మృతి చెందగా, 2013లో జరిగిన అలహాబాద్ కుంభమేళా సందర్భంగా అక్కడి రైల్వేస్టేషన్లో తొక్కిసలాట జరిగి 36 మంది చనిపోయారు. 2014 –19 మధ్య ఆంధ్రప్రదేశ్‌లోని గోదావరి పుష్కరాల సందర్భంగా దాదాపు 30 మంది మరణించారు. తాజాగా ఈ ఏడాది జనవరిలో మళ్లీ ప్రయాగరాజ్ లో జరిగిన మహా కుంభమేళాలో అధికారిక లెక్కల ప్రకారం 30 మంది మరణించారు. ఇవన్నీ రకరకాల కారణాల చేత జరిగిన సంఘటనలు. అమృత స్నానాల కోసం, వెండి నాణెల కోసం, ప్రముఖుల తాకిడి కారణంగా సాధారణ భక్తుల భద్రతను పోలీసు బలగాలు గాలికి వదిలేసి కొద్దిమంది ప్రముఖుల సేవలో ఉండిపోవడంవల్ల జనం అదుపుతప్పి తొక్కిసలాటలు జరిగినవే. ఆంధ్రప్రదేశ్ లోని రాజమండ్రి వద్ద గోదావరి పుష్కరాల సందర్భంగా అంతమంది చనిపోవడానికి కారణం అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తాను ఎంత దైవభక్తిపరుడో, సనాతనధర్మ రక్షకుడో చెప్పుకునేందుకు డాక్యుమెంటరీ సినిమా షూటింగ్ చేసిన కారణంగా జరిగిన తొక్కిసలాట అది. 1954లోనే నెహ్రూ చెప్పిన మాటలు ఈనాటి పాలకులు ఎవరి చెవినా పడుతున్నట్టు లేవు. పైగా నెహ్రూని పక్కా ఫ్యూడల్ అని, ఆయన కారణంగానే ఈ దేశం తాను ముఖ్యమంత్రి అయి దిశానిర్దేశం చేసేదాకా (1990ల వరకు) వెనకబడే ఉందని ప్రస్తుతం ఎన్‌డిఎ ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు విమర్శిస్తూ ఉంటారు. 1954లో నెహ్రూ కాలంనాటికి ప్రచార, ప్రసార సాధనాలు ఈ దేశంలో పెద్దగా లేవు. అప్పట్లో గుప్పెడన్ని వార్తాపత్రికలు ఉండేవేమో. ఎక్కడైనా ఒక సంఘటన జరిగితే విశాల భారతదేశం అంతటికి ఆ వార్త చేరడం అంత సులభంగా ఉండేది కాదు. 2025లో నరేంద్ర మోడీ హయాంలో జరిగిన కుంభమేళా నాటికి ఈ దేశంలో ప్రచార, ప్రసార సాధనాల సాంకేతికత ఊహించని విధంగా విస్ఫోటనంవలే ఎల్లెడలా వ్యాపించి, క్షణాల మీద ఏ సమాచారం అయినా ఒక్క విశాల భారతదేశంలోనే కాక మొత్తం ప్రపంచానికే ఎరుకపరిచే విధంగా ఉన్నా సరైన సమాచారం ప్రజలకు చేరలేదు. నెహ్రూనాటి ప్రజాస్వామ్యానికి, నేటి నరేంద్ర మోడీ కాలంలోని ప్రజాస్వామ్యానికి ఈ తేడా మనకు కొట్టొచ్చినట్టు కనిపిస్తుంది. అప్పట్లో ప్రచార సాధనాలు నిర్భయంగా, నిష్పక్షపాతంగా రాజకీయ, వ్యాపార లాభాపేక్ష లేకుండా పనిచేసేవి కాబట్టి ఉన్నది ఉన్నట్టుగా ప్రజలకు సమాచారాన్ని అందించేవి. ప్రస్తుత ప్రజాస్వామ్యంలో స్వతంత్రంగా ఉన్నాం అని నిటారుగా నిలబడి చెప్పుకోగలిగిన ప్రచార ప్రసార సాధనాలు కనుమరుగైపోతున్నాయి.

ఇప్పుడు ఈ కుంభమేళాలలో జరిగిన సంఘటనల గత చరిత్ర తవ్వడం ఎందుకంటే మళ్లీ సినీ నటుడు విజయ్ కరూర్‌లో నిర్వహించిన రాజకీయ కుంభమేళాలో జరిగిన తొక్కిసలాట కారణంగా 40మంది చనిపోయిన సంఘటన మీద మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి చేసిన వ్యాఖ్యలు. ఈ సంఘటన జరిగిన కారణంగా విజయ్ నాయకత్వానికి పనికి రాకపోతే పైన ఉదహరించిన సంఘటనలన్నిట్లో జరిగిన ప్రాణనష్టానికి ఎవరెవరు నాయకులుగా పనికిరాకుండా పోవాలో న్యాయవ్యవస్థ చెబితే బాగుంటుంది. విజయ్ ర్యాలీ లో తొక్కిసలాట జరిగిన తర్వాత నిర్వాహకులు అంటే ఆయన పార్టీవారు బాధ్యతారహితంగా ఆ ప్రాంతం విడిచి వెళ్లిపోయినందున న్యాయమూర్తి ఇటువంటి వ్యాఖ్యలు చేశారని ఎవరైనా సమర్థించవచ్చు. అందుకు న్యాయమూర్తి వ్యాఖ్యల్ని వ్యతిరేకించాల్సిన అవసరం లేదు. రాజకీయ ప్రముఖులు పాల్గొనే అనేక సభలలో సరైన ఏర్పాట్లు లేక అవస్థలు పడుతున్నవాళ్లు, కొన్ని సందర్భాలలో ప్రాణాలు సైతం పోగొట్టుకుంటున్నవాళ్ళు సామాన్య ప్రజలు. అప్పటికప్పుడు ఏదో తక్షణ స్పందనగా ఆ కుటుంబాలకు కొంత పరిహారం చెల్లిస్తూ ఉండవచ్చు కానీ తరువాత వారి భవిష్యత్తు గురించి ఆలోచించేవారు ఉండరు. అవి ధార్మిక కుంభమేళాలైనా, రాజకీయ కుంభమేళాలైనా, సినిమా వారి ప్రదర్శనలైనా, అత్యుత్సాహ క్రీడా ప్రదర్శనలైనా తేడా ఏం లేదు. ఇటీవలే వరుసగా జరిగిన కొన్ని సంఘటనలు గుర్తొస్తాయి. హైదరాబాదులో ఒక సినీ నటుడు తన సినిమా ప్రీమియర్ షోకి వెళ్లి తొక్కిసలాటకు కారకుడయి, ఒక సాధారణ యువతి మరణానికి కారణమైన సంఘటన కావచ్చు. క్రీడా ఉత్సాహం హద్దులు మీరి, కట్టలు తెంచుకుని ఐపిఎల్ లో తమ రాష్ట్ర జట్టు గెలిచిందన్న అత్యుత్సాహంతో బెంగళూరు స్టేడియంలో జరిగిన సంఘటన కావచ్చు.

# కరెంట్ మోటార్ దొంగల అరెస్ట్, వాహనం స్వాధీనం...




**హుజూర్నగర్ ప్రతినిధి, అక్టోబర్ 04 (సూర్య సేన) :** హుజూర్నగర్ శివారులోని వేపల సింగారం గ్రామానికి వెళ్లే రోడ్డులో చలువాది నర్సింహారావు భూమి నుంచి రెండు రోజుల క్రితం దొంగిలించబడిన 5 హెచ్‌పి కరెంట్ మోటార్ కేసులో నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శనివారం ఉదయం మఠంపల్లి క్రాస్ రోడ్డులో వాహన తనిఖీల్లో భాగంగా ఎస్సై మోహనుబాబు సిబ్బందితో కలిసి మారుతి సుజుకి వ్యాన్ (టీఎస్ 05 ఈవీ 8330) ఆపగా, ఇద్దరు అనుమానితులు పారిపోవడానికి ప్రయత్నించగా వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. విచారణలో సంగిశెట్టి నరేష్, శ్రీరాముల నాగచారి ఇద్దరూ మోటార్‌ను దొంగలించినట్లు ఒప్పుకున్నారు. నిందితుల వద్ద నుంచి 10 వేల రూపాయల విలువ గల మోటార్‌తో పాటు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను కోర్టుకు రిమాండ్‌కు తరలించగా, ఎస్సై మోహనుబాబు, సిబ్బందిని సిఐ జి. చరమందరాజు అభినందించారు.

# నేడు బ్రహ్మిన్ ఆర్గనైజేషన్ ఫర్ సోషల్ సర్వీస్ మేధావుల సమావేశం

**రంగారెడ్డి, అక్టోబర్ 04 (సూర్య సేన) :** ఈనెల ఐదవ తేదీ బ్రాహ్మణ మేధావుల సమావేశంబ్రహ్మిన్ ఆర్గనైజేషన్ ఫర్ సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగిందని ఈ సమావేశానికి అధిక సంఖ్యలో బ్రాహ్మణ బంధువులంతా హాజరుకావాలనిబ్రాహ్మిన్ఆర్గనైజేషన్ ఫర్ సోషల్ సర్వీస్ ( బాస్) రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ కన్వీనర్ వక్కలంక శ్రీనివాసరావు ఒక ప్రకటనలో కోరారు. శనివారం ఆయన పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేస్తూ ఆదివారం జరిగే ఈ కార్యక్రమంలో బాస్ అధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్ రావు ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమం నాగోల్ వసంత విహార్ లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. బ్రాహ్మణ బంధువులంతా ఈ కార్యక్రమానికి హాజరు కావాలని ఆయన కోరారు.



# విజయవాడలో తెలంగాణ డప్పు కళాకారుల ప్రదర్శన, గిన్నిస్ రికార్డు



**గరిడేపల్లి ప్రతినిధి, అక్టోబర్ 04 (సూర్య సేన) :** ఆంధ్రప్రదేశ్‌లో దసరా పండుగ సందర్భంగా విజయవాడ ఉత్సవ్‌లో తెలంగాణ డప్పు కళాకారులు అద్భుత ప్రదర్శన కనబర్చారు. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం అప్పన్నపేటకు చెందిన సతీష్ మ్యూజిక్ అకాడమీ బృందం ఆధ్వర్యంలో 500 మంది ఒకే రిథమ్‌లో డప్పు కొట్టి గిన్నిస్ వరల్డ్ రికార్డు సృష్టించారు. అనంతరం 40కళా బృందాలు, 3000మంది కళాకారుల కవాతులో సతీష్ బృందం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చప్పట్లతో అభినందించగా, కేంద్ర ఉస్తాద్ బిస్మిల్లా ఖాన్ అవార్డు గ్రహీత అందె భాస్కర్, తెలంగాణ రాష్ట్ర డప్పు కళాకారుల సంఘం అధ్యక్షుడు మహంకాళి శ్రవణ్ కుమార్ ప్రశంసలు కురిపించారు. ఈ గిన్నిస్ రికార్డులో హుజుర్నగర్ నియోజకవర్గానికి చెందిన మహిళా డప్పు కళాకారులు నజీర్, కల్పనా, స్వరూప, నాగమణి, చంద్రకళ, మాధవి, సంధ్య, సీత, శోభన్ తదితరులు పాల్గొని విశేష ఆకర్షణగా నిలిచారు.

# ప్రజల కోసం పనిచేసే సిపిఐ అభ్యర్థులను గెలిపించండి : పోకల వెంకటేశ్వర్లు



**గరిడేపల్లి ప్రతినిధి, అక్టోబర్ 04 (సూర్య సేన) :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశవాదులను, అవినీతిపరులను ఓడించి ప్రజలకు అందుబాటులో ఉంటూ గ్రామ, మండల అభివృద్ధి కోసం కృషి చేసే సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని పార్టీ కార్యకర్తలను సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు పోకల వెంకటేశ్వర్లు కోరారు. శనివారం గరిడేపల్లి మండలం రంగాపురం గ్రామంలో జరిగిన సిపిఐ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ, సిపిఐ అభ్యర్థులు సంపాదన కాకుండా ప్రజల కోసం పనిచేస్తారని, వేరే పార్టీ అభ్యర్థులు ఎన్నికల్లో ఓడినా లేదా పదవీకాలం పూర్తయినా మళ్లీ ప్రజల మధ్య ఉండరని విమర్శించారు. అందువల్ల ఎల్లప్పుడూ ప్రజలతో మమేకమై సమస్యల పరిష్కారం కోసం కృషి చేసే సిపిఐ అభ్యర్థులను గెలిపించాలని ఆయన ప్రజలను కోరారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, పోటు కృష్ణబాబు, పోటు చింటూ, గ్రామ కార్యదర్శి తిరగమళ్ళ కిరణ్, సిల్వ, అనిల్, పగడాల శ్రీను, శౌరి తదితరులు పాల్గొన్నారు.

# అంబరాన్నంటిన దసరా సంబురం

- భక్తిశ్రద్ధలతో శమీ పూజలు....గ్రామ గ్రామాన పండుగ శోభ
- జనసంద్రమైన జిల్లా కేంద్రం జమ్మిగడ్డ వీధులు
- సంతోషిమాత దేవాలయం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన శమీ పూజలో పాల్గొన్న మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు జగదీశ్ రెడ్డి సునీత దంపతులు
- ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపం వద్ద పూజలు నిర్వహించిన రాష్ట్ర తెలంగాణ పర్యాటక డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి
- విజయదశమి (దసరా) శమీ పూజ ఉత్సవాలలో పాల్గొన్న సూర్య సేన తెలుగు దినపత్రిక అధినేత, మేనేజింగ్ డైరెక్టర్, కుటుంబ సభ్యులు
- ఘనంగా దుర్గాదేవి నిమజ్జనాలు









**సూర్యాపేట కల్చరల్, అక్టోబర్ 04 (సూర్య సేన) :** చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకునే దసరా సంబరాలు శనివారం జిల్లా వ్యాప్తంగా అంబరాన్నంటాయి. పలు ప్రాంతాల్లో ఉండే వారంతా పండుగకు సొంత ఇళ్లకు తరలి రావడంతో గ్రామాలన్నీ కళకళలాడాయి. ఈ సందర్భంగా ఆయుధపూజ, నూతన వాహన పూజలు, చిన్నారుల పటాకుల మోతలు ,పిండివంటల గుమగుమలు ,కుటుంబ సభ్యుల బంధువుల కోలాహాలంతో దసరా శోభ ఉట్టి పడింది. సాయంత్రం వేళ ప్రజలు కొత్త బట్టలు ధరించి వివిధ ఆలయాలను దర్శించుకొని జమ్మి వృక్షానికి పూజలు చేసి ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు .సూర్యాపేట జిల్లా కేంద్రంలో మాజీ మంత్రి సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి సునీత దంపతులు, తెలంగాణ పర్యాటక డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి మాజీ ఎంపీ బడుగు లింగ యాదవ్, మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ శ్రీనివాస్, సూర్య సేన తెలుగు దినపత్రిక ఎడిటర్ పాల్వాయి జానయ్య యామిని కుటుంబ సభ్యులు తదితరులు దసరా ఉత్సవాలలో పాల్గొన్నారు. సర్వ మతాల ప్రతినిధులు పార్టీ నాయకులు అధికారులు ప్రజలు శాసనసభ్యులు జగదీశ్ రెడ్డి ని క్యాంపు కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. వేదపండితుల ఆశీర్వచనాలు అందజేశారు. సర్వ మతాల ప్రతినిధులతో సహా పంక్తి భోజనం చేశారు. దీంతో జిల్లా అంతట ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది.

విజయదశమి సందర్భంగా జిల్లా కేంద్రంలో దసరా సంబరాలు అంబరాన్ని అంటాయి

తెల్లవారుజామును నుండే పలు దేవాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.వాడవాడ ఆయుధ పూజలతో పాటు అన్ని దేవాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. జిల్లా కేంద్రంలోని జమ్మిగడ్డలో గల మండల పరిషత్ కార్యాలయంలో శ్రీ సంతోషిమాత దేవాలయం ఆధ్వర్యంలో గత 30 సంవత్సరాలుగా నిర్వహిస్తున్న శమీ పూజకు భక్తులు బారులు తీరారు. ప్రత్యేక క్యూ లైన్ ద్వారా వెళ్లి శమీ పూజలో పాల్గొని జమ్మి చెట్టుతో పాటు స్థానికంగా అన్ని దేవాలయాల వారు ఏర్పాటుచేసిన ఉత్సవిగ్రహ దేవత మూర్తులను దర్శించుకున్నారు. సాంప్రదాయ పద్ధతిలో శమీ మంత్రం తో రూపొందించిన కరపత్రాలపై భక్తులు తమ కోరికలు రాసుకొని జమ్మి చెట్టుకు కట్టారు. దసరా రోజున పాలపిట్ట చూడటం అనాదిగా వస్తున్న ఆచారం కావడంతో అక్కడ ఏర్పాటుచేసిన పాలపిట్ట కేంద్రాల వద్ద జనం బారులు తీరి తిలకించారు. వేద పండితులు భక్తులకు శమీ ఆకు అందజేసి ఆశీర్వదించారు. చిన్నారుల నుంచి పెద్దల వరకు పెద్ద ఎత్తున తరలిరావడంతో జమ్మిగడ్డ ప్రాంతమంతా జన సంద్రమై ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఈ వేడుకకు మాజీ మంత్రి సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి దంపతులు తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రవేష్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు,నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ వేడుకలకు వచ్చిన చిన్నారుల నుంచి పెద్దల వరకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్ రెడ్డి తో సెల్ఫీలు దిగడం కొరకు బారులు తీరారు.









ప్రత్యేక ఆకర్షణగా కైలాస శంకరులు

దసరా పండుగను పురస్కరించుకొని గత 31 సంవత్సరాలుగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శ్రీ సంతోషిమాత దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న కైలాస శంకర్ ల స్టేజి అలంకరణ జమ్మిగడ్డలో భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా హాజరైన భక్తులు కైలాస శంకరులు స్వామి అమ్మవార్లను పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి, దర్శించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించి తమ భక్తిని చాటుకున్నారు. రాంకో సిమెంట్ కంపెనీ డీలర్ తల్లాడ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో భక్తులందరికి ఉచిత ప్రసాదాలు పంపిణీ చేశారు. కైలాస శంకర్ స్టేజి అలంకరణ వద్ద పిల్లలు పెద్దలు పెద్ద ఎత్తున ఫోటోలు దిగారు. ఏ లాంటి అవాంఛనియ సంఘటనలు జరగకుండా ప్రత్యేక పోలీసు బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీ సంతోషిమాత దేవాలయం అధ్యక్ష కార్యదర్శులు నూక వెంకటేశ గుప్తా బ్రాహ్మ0డ్ల పల్లి మురళీధర్ కమిటీ సభ్యులు పబ్బా ప్రకాష్ రావు, బెలిదే అశోక్, గోపారపు రాజు, బ్రాహ్మణపల్లి బ్రహ్మయ్య,ఉప్పుల రమేష్,నూక రవిశంకర్, శివ ప్రసాద్ దేవాలయం మేనేజర్ బచ్చు పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

శ్రీ రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చిన శ్రీ సంతోషిమాత దేవి శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా శనివారం విజయదశమి రోజున శ్రీ సంతోషిమాత అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరి దేవిగా భక్తులకు దర్శనం ఇచ్చింది. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు బట్టారం వంశీకృష్ణ శర్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చండి హెూమం రుద్ర హెూమం తో పాటు భవాని దీక్ష మాల ధారణ స్వాములకు పూజ నిర్వహించారు. బ్రాహ్మణ ముత్తైదువకు సుహాసిని పూజ నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. సాయంత్రం వేళ దేవాలయంలో ఏర్పాటుచేసిన శమీ పూజ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# గాంధీ కుటుంబాన్ని పరామర్శించిన బీజేపీ జిల్లా నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి

- చందబోయిన గాంధీ కుటుంబాన్ని ఆదుకోవాలి
- బీజేపీ జిల్లా నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి



**కూసుమంచి, అక్టోబర్ 04 (సూర్య సేన) :** ఇటీవల కూసుమంచి మండలం పాలేరు గ్రామంలో మిషన్ భగీరథ లో అవుట్సోర్సింగ్ పద్ధతిలో ఉద్యోగం చేస్తున్న చందనబోయిన గాంధీ సంబంధిత యాజమాన్యం సకాలంలో జీతాలు చెల్లించకపోవడం వలన కుటుంబంలో ఆర్థిక ఇబ్బందులు ఏర్పడి ఆత్మహత్య చేసుకోవడం జరిగినది వారి కుటుంబాన్ని కూసుమంచి భారతీయ జనతా పార్టీ అధ్యక్షురాలు చందనబోయిన పుణ్యవతి తో కలిసి పార్టీ నాయకులు పరామర్శించడం జరిగినది. ఈ సందర్భంగా బిజెపి జిల్లా నాయకులు గుండా ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ గాంధీ ఆత్మహత్య కేవలం మిషన్ భగీరథ యాజమాన్యం సకాలంలో జీతాలు చెల్లించకపోవడం వలన వారి కుటుంబం అప్పుల ఊబిలో కూరకపోయి ఆర్థికంగా ఇబ్బందులు ఏర్పడటం వల్లన ఆత్మహత్య చేసుకోవడం జరిగినది వారి కుటుంబానికి ప్రగాఢ సంతాపాన్ని తెలియజేస్తూ భగవంతుడు వారికి మనోధైర్యాన్ని కల్పించ వలసిందిగా ప్రార్థించడం జరిగినది. చందనబోయిన గాంధీ కుటుంబానికి ప్రభుత్వం సంబధిత యాజమాన్యం ద్వారా ఐదు లక్షల రూపాయల పరిహారం ఇప్పించడం తో పాటు ప్రభుత్వం కూడా ఐదు లక్షల రూపాయల పరిహారము ను కుటుంబానికి అందివ్వాలని అదేవిధంగా కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగము ఇవ్వవలసిందిగా ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరుచున్నాము ఇంటికి పెద్దదిక్కు కోల్పోయి రోడ్డున పడిన కుటుంబాన్ని ప్రభుత్వము త్వరగా ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నాము ఇట్టి విషయంపై అవసరమైతే కుటుంబ సభ్యులతో కలిసి కలెక్టర్ ని కలిసి పరిహారం మరియు కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగము త్వరగా ఇప్పించవలసిందిగా కోరుతాము అని తెలియచేస్తున్నాము. గాంధీ కుటుంబాన్ని పరామర్శింన వారిలో పార్టీ జిల్లా సీనియర్ నాయకులు హటియా నాయక్, బెల్లం మురళీ, దాసరి వెంకటేశ్వర్లు ,కొత్త శ్రీనివాస్ రెడ్డి, గడ్డం వెంకటేశ్వర్లు, పొన్నం ఉపేందర్ నాయుడు,కోర్లట్ల వీరన్న, మహేంద్ర నాయక్, మంద చంద్రశేఖర్ గౌడ్ , బద్దం వెంకట్ రెడ్డి, మట్టే రాములు, దామళ్లా ప్రభాకర్,శంకర్ నాయక్, కోడి వెంకన్న, కోడి భద్రయ్య, బానోత్ కృష్ణా, శ్రీ క్రిష్ణ, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు ఖాయం

- మాజీ ఎంపీపీ చుండూరు వెంకటేశ్వరరావు



**అనంతగిరి ప్రతినిధి, అక్టోబర్ 04 (సూర్య సేన) :** స్థానిక సంస్థల ఎన్నికల్లో కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని మాజీ ఎంపీపీ చుండూరు వెంకటేశ్వరరావు ఓ ప్రకటన ద్వారా అన్నారు.గత బిఆర్ఎస్ పాలనలో అవినీతి మయంగా మారిన నియోజకవర్గాన్ని ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి రెడ్డి పాలనలో అవినీతి రహితంగా అభివృద్ధి వైపు అడుగులు వేస్తుందని అన్నారు.సస్యశ్యామలంగా అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన వాగ్దానాలను కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నారన్నారు.ఓట్ల కోసం గ్రామాల్లోకి వచ్చే బి ఆర్ ఎస్, బీజేపీ నేతలను నిలదీయాలని ఆయన అన్నారు.గడిచిన 21 నెలల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించిందని ఆయన గుర్తు చేశారు.ఆర్టీసీ బస్సులో మహిళ ఉచిత బస్సు ప్రయాణం,ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.10 లక్షల వరకు ఉచిత వైద్యం వంటి పథకాలు ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నాయని,ఇందిరమ్మ ఇండ్లు,రేషన్ కార్డులు,200 యూనిట్ల ఉచిత విద్యుత్,బీటీ రోడ్లు,సీసీ రోడ్లు,మౌలిక వసతులు ఇలా గ్రామాలన్నింటికీ చేరాయని వివరించారు.ఈ పథకాలు అభ్యర్థుల విజయానికి ప్రధాన బలం అవుతాయని అన్నారు.

# కళా భూషణ్ అవార్డు అందుకున్న నూకపంగు ఈదయ్య




**అనంతగిరి ప్రతినిధి, అక్టోబర్ 04 (సూర్య సేన) :** అనంతగిరి మండల మనం పత్రిక రిపోర్టర్ నూకపంగు ఈదయ్యకు మీడియా రంగంలో ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఎంతో నిబద్ధతతో పనిచేసినందుకు త్యాగరాయగానసభ చిక్కడపల్లిలో శనివారం కళా భూషణ్ పురస్కార్ అవార్డును మహాశాస్త సేవ ట్రస్ట్ వారు ప్రధానం చేశారు.ఈ సందర్భంగా నూకపంగు ఈదయ్య మాట్లాడుతూ ఇంత మంచి అవార్డును అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని ఈ అవార్డును ప్రధానం చేసిన ట్రస్టు వారికి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు. ఈ అవార్డును అందుకోవటం వల్ల మరింత బాధ్యత పెరుగుతుందని అన్నారు.

# ఘనంగా కనకదుర్గమ్మ తల్లి అమ్మవారి శోభాయాత్ర





**మంగపేట, అక్టోబర్ 04 (సూర్య సేన) :** మంగపేట మండలం తిమ్మంపేట గ్రామం లో రామలయంనందు ఏర్పాటు సేసిన అమ్మవారి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ప్రతి ఏట నిర్వహించే కనకదుర్గమ్మ తల్లి ప్రభబండ్ల పండుగ వేడుకల్ని దేవాలయ కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. కనకదుర్గమ్మ తల్లి కి ఘనంగా పూజలు నిర్వహించిన అనంతరం ట్రక్టర్ పై ఊరేగింపుగా బయలుదేరగా గ్రామంలోని ప్రజలు నీళ్లు ఆరబోసి పాలు పండ్లు కొబ్బరికాయలు ప్రత్యేక నైవేద్యాలు కనకదుర్గమ్మ తల్లికి సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కనకదుర్గమ్మ తల్లి ఊరేగింపులో డప్పు చప్పులతో కోలాటపు ఆటపాటల నృత్యాలతో, మహిళలు యువకులు చిన్న పెద్ద అందరూ కలిసి డాన్సులు వేస్తూ, బాణాసంచా కాలుస్తూ అమ్మవారినీ నిమజ్జనానికి తరలించారు.ఈ కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ మహిళా మండలం అధ్యక్షురాలు శానం నిర్మల, మహిళా లు, గ్రామస్తూ లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# బ్రాహ్మణ జాతి సమాజాన్ని జాగృతం చేయాలి




– భాగ్యనగర్ బ్రాహ్మణ సొసైటీ 25వ రాష్ట్రస్థాయి బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదికలో వక్తలు

**రంగారెడ్డి, అక్టోబర్ 04 (సూర్య సేన) :** బ్రాహ్మణ జాతి సమాజాన్ని జాగృతంచేయాలని ఉన్నత స్థానాలకుఎదుగుతూనేఅనాధలు వృద్ధులుదివ్యాంగులు,విద్యకు నోచుకోని వారికిచేయూతనివ్వాలని భాగ్యనగరంబ్రాహ్మణసొసైటీ25వరాష్ట్రస్థాయిబ్రాహ్మణవధూవరులపరిచే వేదికలో వక్తలు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా వేదికపై 25వరాష్ట్రస్థాయి బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక పుస్తకాలను సీనియర్ బ్రాహ్మణ నాయకులు ఆవిష్కరించారు. కొన్ని సంవత్సరాల క్రితం హైదరాబాద్ నడిబొడ్డులో భాగ్యనగర్ బ్రాహ్మణ సొసైటీ భవనం పురుడు పోసుకుందనిఅప్పటినుండి ఎంతోమంది ఎందరో దాతలను సంప్రదించి ఆ భవనాన్ని అభివృద్ధి చేశారని అన్నారు. సభకు అధ్యక్షత వహించినఎరికలపూడి భవాని సభను సమన్వయం చేశారు. భాగ్యనగరం బ్రాహ్మణ సొసైటీ ప్రధాన కార్యదర్శి పెండ్యాల శేష సాయి వరప్రసాద్ ( వైష్ణవి ప్రసాద్) మాట్లాడుతూ నగరం నడిబొడ్డున సొంతభవనంనిర్మించుకోవడం మామూలు విషయం కాదని అది మా పెద్దలందరూ నిర్విరామంగా కృషిచేసి సాధించారని ఇప్పుడు బీద బ్రాహ్మణ విద్యార్థులు చదువు కోసం వైద్య సేవల కోసం మూడు అంతస్తులుగా ఉన్న భవనానికి వృద్ధుల సౌకర్యార్థం లిఫ్ట్ ఏర్పాటు చేయడం జరుగుతుందనిభవనంలో ఎన్నో వన్నెతెచ్చేకార్యక్రమాలు చేయాలనిసంకల్పంతీసుకున్నామని, ప్రతివారం విష్ణు సహస్రనామాలు, గీత జయంతి, కార్తీక సమారాధన మొదలైన కార్యక్రమాలు నిర్విరామంగా కొనసాగిస్తున్నామని వీటిలో మరింత మంది సభ్యులు పాల్గొనే మరో అడుగు ముందుకు వేయాలని ఆకాంక్షించారు. భాగ్యనగరం బ్రాహ్మణ సొసైటీ అధ్యక్షురాలు వై .భవాని పిన్ ల్యాండ్ దేశ పర్యటనలో ఉన్న అక్కడ నుండి రిజిస్ట్రేషన్ నిర్వహించి వివాహ పరిచయ వేదిక విజయవంతం చేశారని వారికి తమ కృతజ్ఞతలు తెలిపారు. చదువుల తల్లి చదువుకు చేయూత ఈ సందర్భంగా 17 సంవత్సరాల క్రితం టైఫాయిడ్ వ్యాధితో తన తల్లి చనిపోయిన పట్టువదలని ఆత్మవిశ్వాసంతో చెక్కుచెదరని ధైర్యంతో ప్రస్తుతం ఎంబిబిఎస్ మెడిసిటీఘన్ పూర్ మేడ్చల్ లో చదువుకుంటున్నమానికొండ శ్రీ మహతి, ఆమెకు విద్యకు సహాయం చేయాలని కార్యదర్శి పెండ్యాల శేష సాయి వరప్రసాద్ , ఒక లక్ష 25 వేల రూపాయలను,మానికొండ శ్రీ మహతి, తండ్రి అయినమానికొండ హనుమత్ పార్థసారథి సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా పార్థసారథి మా ప్రతినిధితో మాట్లాడుతూ తమ అమ్మాయి ఉన్నత చదువులకు చేయూతనిచ్చేందుకుముందుకు వచ్చిన భాగ్యనగరం బ్రాహ్మణ సొసైటీ ప్రధాన కార్యదర్శి పెండ్యాల శేష సాయి వరప్రసాద్ కృతజ్ఞతలు తెలుపుతూ, తమ మరో బాబు మానికొండవెంకటఫణింద్ర బీటెక్ పూర్తి చేశారని, భాగ్యనగర్ బ్రాహ్మణ సొసైటీ చూపిన ఈ ఔదార్యం దృష్టిలో ఉంచుకొని ఇద్దరు పిల్లలను అద్భుతంగా తీర్చిదిద్దేందుకు నా వంతు కృషి చేస్తాననిఆనందభాష్పాలతో చెప్పారు. ఇంకా ఈ కార్యక్రమంలో గతంలో పనిచేసిన అధ్యక్ష కార్యదర్శులు ప్రస్తుతం పనిచేస్తున్న అధ్యక్ష కార్యదర్శులు భాగ్యనగర్ బ్రాహ్మణ సొసైటీ ఫౌండర్ మెంబర్లు జీవీఆంజనేయులు, సర్వేశ్వరరావు,జీవీఎస్ ప్రకాష్ రావు, పింగళి నాగేశ్వరరావు, ఎరికలపూడిభవాని, మురళీధర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# ముగిసిన టైగర్ దామన్న శకం

- తుంగతుర్తి నియోజకవర్గంలో విషాద ఛాయలు
- నివాళులర్పించిన పలువురు మంత్రులు ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు
- శోకసంద్రం నడుమ ముగిసిన రాంరెడ్డి దామోదర్ రెడ్డి అంతిమయాత్ర
- అధికార లాంచనాలతో అంత్యక్రియలు









**తుంగతుర్తి ప్రతినిధి, అక్టోబర్ 04 (సూర్య సేన) :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ మంత్రి దామోదర్ రెడ్డి అంతిమయాత్ర శనివారం తుంగతుర్తి మండల కేంద్రంలో భారీ జనసంద్రం మధ్య సాగింది.ఆయన అభిమానులు కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులు నాయకులు కార్యకర్తలు కుటుంబ సభ్యులు బంధుమిత్రులు తమ అభిమాన నేత ఇక లేడు అనే విషయాన్ని జీర్ణించుకోలేక బోరున విలపించారు.దామన్నలాంటి నేత ఇంకా ఎప్పుడు చూడలేమని ఆయనతో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ కన్నీటిపర్వంతమయ్యారు. అధికార లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. అంతిమయాత్రకు వచ్చిన వేలాది మందితో రోడ్లన్నీ కిక్కిరిసాయి దామన్న అంతిమయాత్రకు మహారాష్ట్రలోని నాందేడ్ నుండి 18 క్వింటాళ్ల బంతిపూలు తెప్పించడం జరిగింది.తుంగతుర్తి నియోజకవర్గంతో పాటు సూర్యాపేట జిల్లాలో ఎంతో చరిత్ర కలిగిన నాయకుడు పార్టీ కోసం పనిచేసి ఐదు సార్లు ఎమ్మెల్యేగా రెండుసార్లు మంత్రిగా ప్రజలకు సేవలు అందించారు.నాలుగు దశాబ్దాల పాటు ఉమ్మడి నల్గొండ జిల్లా రాజకీయాలలో చెరగని ముద్ర వేసుకున్న గొప్ప నాయకుడు రాంరెడ్డి దేవాలయాల కోసం విద్యాలయాల కోసం స్మశానవాటికల కోసం 1500 ఎకరాలకు పైగా భూమిని దానం చేసిన గొప్ప నాయకుడు దామోదర్ రెడ్డి నేటి రాజకీయాల్లో ఒకసారి ఎమ్మెల్యే అయ్యారంటే వందల ఎకరాలు వందల కోట్లు సంపాదిస్తున్న నాయకులు ఉన్నారు.కానీ దానికి భిన్నంగా దామోదర్ రెడ్డి 5 సార్లు ఎమ్మెల్యే రెండుసార్లు మంత్రిగా చేసి సంపాదించింది ఏమీ లేదు తనకు వారసత్వంగా వచ్చిన 1500 ఎకరాల భూమిని దానం చేశాడు.ఈ అంతిమయాత్రలో ఘన నివాళులు అర్పించిన పలువురు నాయకులు శనివారం మండల కేంద్రంలోని వారి నివాసంలో జిల్లా ఇన్చార్జి మంత్రి ఎస్సీ ఎస్టీ మైనార్టీ శాఖ మంత్రి అడ్డూరి లక్ష్మణ్,రోడ్డు భవనాల శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పౌరసరఫరాల శాఖమంత్రి ఉత్తంకుమార్ రెడ్డి,శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి,పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్,తుంగతుర్తి శాసనసభ్యులు మందుల సామేలు,సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్వర్ రెడ్డి,దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్,మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి,నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం,పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి,పశ్చిమ వరంగల్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్రెడ్డి,నాగార్జునసాగర్ ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు హనుమంతరావు,ఎమ్మెల్సీలు నెల్లికంటి సత్యం,శంకర్ నాయక్, కోటిరెడ్డి,మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్,మాజీ ఎమ్మెల్యేలు సంకినేని వెంకటేశ్వరరావు డాక్టర్ గాదరి కిషోర్ కుమార్,వేనేపల్లి చందర్రావు,బూడిద బిక్షమయ్య గౌడ్,సూర్యాపేట జిల్లా పరిషత్ మాజీ చైర్ పర్సన్ గుజ్జ దీపిక యుగంధర్ రావు,ప్రముఖ కాంట్రాక్టర్ సంకినేని కృష్ణారావు, సూర్యాపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్,మహిళా అధ్యక్షురాలు అనురాధ,బీసీ కమిషన్ సభ్యురాలు బాలలక్ష్మి,చైల్డ్ వెల్ఫేర్ కమిషన్ సభ్యులు సరిత,తెలంగాణ రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి,సూర్యాపేట మార్కెట్ చైర్మన్ కొప్పుల వేనారెడ్డి,సంకినేని రవీందర్రావు, జ్ఞానసుందర్,యుగంధర్,పాల్వాయి రజిని,బైరు వెంకన్న,గుడిపాటి నరసయ్య మల్లపాక సాయిబాబు, తోపాటు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# జానీ చికెన్ సెంటర్ బంపర్ డ్రా



**మంగపేట, అక్టోబర్ 04 (సూర్య సేన) :** మంగపేట మండలం లోని రాజుపేట గ్రామంలో జానీ చికెన్ సెంటర్ వద్దా దసరా సందర్భంగా జానీ చికెన్ సెంటర్ బంపర్ డ్రా పెట్టడం జరిగింది ది: 03 శుక్రవారం సాయంత్రం 4 గంటలకు డ్రా తీయడం జరిగింది. రమణక్కపేట గ్రామస్తులైన బట్ట పురుషోత్తం ఎస్సై ముఖ్యఅతిథిగా వచ్చారు వారి చేతుల మీదగా డ్రా లో బహుమతులు గెలుచుకున్న వారికి బహుమతులు అందించడం జరిగింది పినపాక మండలం లోని దినేపల్లి గ్రామానికి చెందిన సున్నం మహేష్ ఐదువేయిల రూపాయలు (5000/రూ) మొదటి బహుమతి గెలుచుకున్నారు. దుగినేపల్లి గ్రామం సుంక్కరి సాయి చరణ్ రెండవ బహుమతి మీక్సీ గెలుచుకున్నారు. మంగపేట మండలం నిమ్మగూడెం గ్రామం మధ్యల కేశ్వరావు మొబైల్ ఫోన్ మూడో బహుమతి దక్కించుకున్నారు. అలాగే డ్రా సిస్టమ్ పెట్టినటువంటి జానీ చికెన్ సెంటర్ వారు. లాభం ఏమి ఆశించకుండా డ్రా లో పేర్లు రాకుండా మిగిలిన వారికి. రెండు వందల రూపాయలు చికెన్ ప్రతి ఒక్కరికి ఇవ్వడం జరిగింది. అలాగే బట్ట పురుషోత్తం. ఎస్సై కి సన్మానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డ్రాలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ అధిక సంఖ్యలో పాల్గొనడం జరిగింది



# అమెరికాలో దుండగుల కాల్పుల్లో విద్యార్థి చంద్రశేఖర్ మృతి చెందడం తీవ్ర బాధాకరం: ఎంపీ వద్దిరాజు



**ఖమ్మం, అక్టోబర్ 04 (సూర్య సేన) :** హైదరాబాద్ ఎల్బీనగర్‌కు చెందిన దళిత విద్యార్థి చంద్రశేఖర్ ఉన్నత చదువుల కోసం అమెరికాలోని డల్లాస్ కు ఇటీవల వెళ్లగా శనివారం తెల్లవారుజామున దుండగులు జరిపిన కాల్పుల్లో మృతి చెందడం తీవ్ర బాధాకరమని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్ రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. ఉన్నత విద్యనభ్యసించి గొప్పగా స్థిరపడతానుకున్న తమ కుమారుడు ఇక లేడని తెలిసి చంద్రశేఖర్ తల్లిదండ్రులు పడుతున్న ఆవేదన పూడ్చలేనిదని ఎంపీ రవిచంద్ర ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దివంగత విద్యార్థి చంద్రశేఖర్ తల్లిదండ్రులు కుటుంబ సభ్యులకు ఎంపీ రవిచంద్ర తీవ్ర సంతాపం తెలిపారు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. చంద్రశేఖర్ భౌతికకాయాన్ని వీలైనంత తొందరగా హైదరాబాద్ కు రప్పించేలా వెంటనే అవసరమైన చర్యలు తీసుకోవలసిందిగా ఎంపీ వద్దిరాజు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు.

# సూర్యాపేటలో జుడియో స్టోర్ ప్రారంభం



– సుధాకర్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ ఎండీ మీలా మహదేవ్

**సూర్యాపేట టౌన్, అక్టోబర్ 04 (సూర్య సేన) :** వినియోగదారుల మన్ననలు పొందినప్పుడే ఏ వ్యాపారమైన అభివృద్ధి చెందుతుందని సుధాకర్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ ఎండీ మీలా మహదేవ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన జుడియో స్టోర్ ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. పెద్దపెద్ద నగరాలలో ఏర్పాటు చేసే కార్పొరేట్ కంపెనీల స్టోర్స్ ను సూర్యాపేట జిల్లా కేంద్రంగా మారిన తర్వాత ఇక్కడ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వివిధ నగరాలకు వెళ్లకుండా స్థానికంగా ప్రజల ముందుకే ఆయా కంపెనీల స్టోర్స్ వస్తున్నాయని అన్నారు. వినియోగదారులకు నమ్మకమైన, నాణ్యమైన సేవలను అందించాలన్నారు. జిల్లా కేంద్రంలో జుడియో స్టోర్ ను ప్రారంభించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు కక్కిరేణి చంద్రశేఖర్, కోటగిరి రాధాకృష్ణ,తోట శ్యాంప్రసాద్, రాచర్ల కమలాకర్, కక్కిరేణి మోహన్, శర్మ, కొత్త ఆంజనేయులు, గజ్జల జనార్ధన్, రాచకొండ శ్రీనివాస్, ముప్పారపు నాగేశ్వరరావు, ముప్పారపు నరేందర్, డాక్టర్ తోట కిరణ్, పోతగంటి నరసింహారావు, బజ్జూరి శ్రీనివాస్, జుడియో ఏరియా మేనేజర్ రాజ్ కుమార్, స్టోర్ మేనేజర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.






# ప్రతి ఒక్కరూ “మానసిక ఆరోగ్యం” పై దృష్టి సారించాలి

– ఈ నెల 4 నుండి 12 వరకు “మానసిక ఆరోగ్యం– శ్రేయస్సు” పై లయన్స్ క్లబ్ ఆఫ్ నల్గొండ ఆధ్వర్యంలో వారోత్సవాలు

– జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**నల్గొండ టౌన్, అక్టోబర్ 04 (సూర్య సేన) :** ప్రతి ఒక్కరూ “మానసిక ఆరోగ్యం” పై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఈ నెల 4 నుండి 12 వరకు “మానసిక ఆరోగ్యం– శ్రేయస్సు” పై లయన్స్ క్లబ్ ఆఫ్ నల్గొండ వారు నిర్వహిస్తున్న వారోత్సవాలలో భాగంగా శనివారం నల్గొండ జిల్లా కేంద్రం లోని ఎన్జీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం సమాజంలో ప్రతి ఒక్కరు ఎదో రకంగా మానసికంగా బాధపడుతున్నారని,మరికొందరు మానసిక వత్తిడికి లోనవుతున్నారన్నారు. అయినప్పటికీ మనం ఈ సమస్యను పక్కన పెడుతున్నామని, మానసిక వత్తిడి తగ్గాలంటే జీవన విధానం మార్చుకోవాలని ,స్మార్ట్ ఫోన్ ను సాధ్యమైనంతగా తగ్గించాలని, ప్రత్యేకించి పాఠశాల, కళాశాల విద్యార్థులు స్మార్ట్ ఫోన్ ను పక్కన పెట్టాలన్నారు. పెద్దలు సైతం రాత్రి సమయాలలో వత్తిడి లేకుండా ఉన్నప్పుడే మంచి నిద్రతో పాటు, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. మానసిక ఆరోగ్యం పై లయన్స్ క్లబ్ జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలు, కళాశాలలో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మనిషి శారీరకంగా ఆరోగ్యంగా ఉన్నంత మాత్రాన సరిపోదని ,మానసిక ఆరోగ్యంగా ఉండడం కూడా చాలా ముఖ్యమని, దీనికై ఉదయపు నడక, ప్రశాంతత, ఒత్తిడికి లోను కాకుండా ఉండడమే ముఖ్యమని అన్నారు. ఇటీవల కాలంలో చిన్న వయసు వారు సైతం గుండెజబ్బులతో చనిపోతున్న విషయాన్ని మనం గమనిస్తున్నామని, మనిషి అనేక రకాల ఒత్తిళ్లకు గురి కావడం జరుగుతున్నదని, ఈ వత్తిడికి అన్ని అంశాలు ప్రభావితం చేస్తున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ మానసికంగా దృఢంగా ఉండేలా చూసుకోవాలని , మెదడుకు ఆ విధంగా శిక్షణ ఇవ్వాలని,ఇందుకు గాను తప్పనిసరిగా ఒత్తిడి కల్పించని అంశాలను చదవాలని చెప్పారు. పోటీ పరీక్షలు,ఇతర అంశాలలో పేద పిల్లలకు సహాయం చేసేందుకు నల్గొండలో ఒక టౌన్ హాల్ నిర్మించేందుకు ప్రణాళిక రూపొందిస్తున్నామని, ఈ విషయంలో లయన్స్ క్లబ్ సహకరించాలని కోరారు. లయన్స్ క్లబ్ లాగా అందరూ ముందుకు వచ్చి సామాజిక సేవా పద్ధతిని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని కలెక్టర్ అన్నారు. లయన్స్ క్లబ్ డిస్టిక్ గవర్నర్ మదన్ మోహన్, నల్గొండ ఆర్డీవో వై.అశోక్ రెడ్డి ,తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.







# స్థానిక వ్యూహాల్లో కమలం నేత లు




**హైదరాబాధ్, అక్టోబర్ 04 (సూర్య సేన) :** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుండి ప్రధాన రాజకీయ పార్టీలు గెలుపు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. స్థానిక ఎన్నికలంటే అధికార పార్టీకి అనుకూలంగా ఉంటుందనే టాక్ ఉన్నప్పటికీ, మేమెక్కడా తగ్గేదే లేదంటున్నాయి బిజేపి ,బీఆర్ ఎస్ పార్టీలు. ముఖ్యంగా బిజేపి ఈసారి లోకల్ వార్ లో సత్తా చాటేందుకు సర్వశక్తులు ఒడ్డుతోంది. అర్బన్ ప్రాంతాల్లోనే పట్టుందనేది కేవలం రూమర్లు మాత్రమే , బిజేపి బలం గ్రామీణ ఓటర్లేనని నిరూపించేందుకు ఇప్పటికే క్యాడర్ ను సన్నద్ధం చేస్తోంది.తెలంగాణ బిజేపికి 8 మంది ఎమ్మెల్యేలు, మరో 8 మంది ఎంపీలు ఉన్నారు.ఎనిమిది మంది ఎమ్మెల్యేలలో ఏడుగురు గ్రేటర్ బయట గెలిచినవారే. ఎనిమిది ఎంపీల విషయానికి వస్తే , వీరు గెలిచిన పార్లమెంట్ నియోజకవర్గాలు ఎక్కువ గ్రామీణ ప్రాంతాలున్న నియోజకవర్గాలే. ఇది చాలదా మా గెలుపు ఏ స్థాయిలో ఉంటుందో చూపించడానికి అంటోంది కమలం పార్టీ. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేస్తాం. గ్రామస్థాయి సర్పంచ్ నుండి జిల్లా స్థాయి జెడ్ పీటీసీ వరకూ బిజేపి అభ్యర్థులను పోటీకి దించడంతోపాటు, కాంగ్రెస్ ,బిఆర్ ఎస్ ను అధిగమించి , నెంబర్ వన్ స్థానాలు మేమే సాధిస్తామంటున్నారు ఆ పార్టీ కీలకనేతలు.బిజేపికి గ్రామీణ ప్రాంతాల్లో బలమైన క్యాడర్ ఇప్పటి వరకూ లేదు. క్షేత్రస్థాయిలో బలమైన నాయకులు లేరు. ప్రకటించిన స్థాయిలో అభ్యర్థులను ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి దింపాలన్నా, అంతలా సై అంటూ దూకే అభ్యర్థులు ఇప్పటి వరకూ లేరు. బిజేపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు పగ్గాలు చేపట్టిన తరువాత , పార్టీలోకి వలసలు ఆహ్వానించినా, బిజేపి తలుపులు ఓపెన్ చేసి పెట్టినా, ఆశించిన స్థాయిలో పార్టీలోకి చేరికలు కనిపించలేదు.

# పటిష్టంగా ఆర్థిక వృద్ధి...

ముంబై, అక్టోబర్, 4 (సూర్యసేన ప్రతినిధి): భారత్ దీర్ఘకాలిక రుణ రేటింగ్‌ను స్థిరమైన ఔట్‌లుక్‌తో యథాతథంగా 'బీఏఏ3'గా కొనసాగిస్తున్నట్లు అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ మూడీస్ తెలిపింది. ఆర్థిక వృద్ధి పటిష్టంగా ఉండటం, అంతర్జాతీయంగా వాణిజ్యం, చెల్లింపులకు సంబంధించి మెరుగైన స్థితిలో ఉండటం, తదితర అంశాలు ఇందుకు కారణమని సంస్థ వివరించింది.

ఇవన్నీ కూడా అమెరికా టారిఫ్‌ల భారం, తయారీ రంగంలో పెట్టుబడుల ఆకర్షణకు ఎదురవుతున్న అవాంతరాలు మొదలైన అంతర్జాతీయ ప్రతికూల పవనాలను ఎదుర్కొనే బలాన్ని అందిస్తున్నాయని పేర్కొంది.

దేశీయంగా భారీ మార్కెట్, జనాభా తీరుతెన్నులపరంగా సానుకూలతలాంటి అంశాలు .. అంతర్జాతీయ షాక్‌ల నుంచి దేశీ ఎకానమీకి రక్షణ కల్పిస్తున్నట్లు పేర్కొంది. మరోవైపు, జీడీపీ వృద్ధి అధిక స్థాయిలో ఉండటం, ఆర్థిక స్థిరీకరణ వంటి అంశాలనేవి భారీ స్థాయిలో ఉన్న ప్రభుత్వ రుణభారాన్ని నెమ్మదిగా తగ్గించుకోవడానికే తోడ్పడతాయే తప్ప ఎకాయెకిన తగ్గించుకోవడానికి ఉపయోగపడకపోవచ్చని తెలిపింది. పైగా వినిమయాన్ని పెంచే దిశగా ఇటీవల తీసుకున్న చర్యల వల్ల ప్రభుత్వ ఆదాయానికి కొంత గండి పడుతుందని, దీంతో రుణభారాన్ని అదుపులో ఉంచుకోవడం కష్టంగా మారొచ్చని మూడీస్ వివరించింది. ఇటీవలే ఎస్‌అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ సంస్థ 18 ఏళ్లలో తొలిసారిగా భారత్ సార్వభౌమ రేటింగ్‌ను అప్‌గ్రేడ్ చేసింది. 'ట్రిపుల్‌బీ మైనస్' నుంచి ట్రిపుల్ బీ'కి పెంచింది. అటు జపాన్‌కి చెందిన రేటింగ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ ఇన్ఫర్మేషన్ (ఆర్‌అండ్‌ఐ) కూడా దీర్ఘకాలిక సావరీన్ రేటింగ్‌ను ట్రిపుల్ బీ నుంచి ట్రిపుల్ బీ ప్లస్‌కి పెంచింది. ఇక మార్నింగ్‌స్టార్ డీబీఆర్‌ఎస్ సైతం ట్రిపుల్ బీ (కనిష్ట) నుంచి ట్రిపుల్ బీ స్థాయికి అప్‌గ్రేడ్ చేసింది.




# కొత్త గరిష్ఠాలకు చేరిన బంగారం, వెండి ధరలు



ముంబై, అక్టోబర్, 4 (సూర్యసేన ప్రతినిధి): దేశంలో బంగారం, వెండి ధరలు కొత్త రికార్డు గరిష్ఠాలకు చేరుకున్నాయి. సోమవారం దేశ రాజధానిలో వెండి ధరలు ఏకంగా రూ.7,000 పెరిగి కిలోకు రూ.1.50 లక్షలకు చేరుకోగా, బంగారం కూడా రూ.1,19,500కు చేరుకుని కొత్త గరిష్ట స్థాయికి చేరుకుందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ తెలిపింది.వెండి ధరలు వరుసగా నాలుగో సెషన్‌లోనూ పెరిగాయి. హైదరాబాద్ మార్కెట్లో కిలో వెండి రూ. 1.60 లక్షల(అన్ని పన్నులు కలిపి)కు చేరుకుంది. 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పసిడి రూ. 920 పెరిగి 10 గ్రాములకు రూ.1,19,964 (అన్ని పన్నులతో సహా)గా ఉంది. ఆభరణాల తయారీలో వాడే 22 క్యారెట్ల బంగారం పది గ్రాములు రూ. 850 పెరిగి రూ. 1,07,831(అన్ని పన్నులతో సహా)కి చేరింది. గ్లోబల్ మార్కెట్లలోనూ ఇదే పరిస్థితి ఉంది. బంగారం, వెండి రెండూ భారీగా పెరుగుతున్నాయి.

స్పాట్ గోల్డ్ దాదాపు 2 శాతం పెరిగి ఔన్సు 3,824.61 డాలర్లకు ఆల్‌టైమ్ గరిష్ఠానికి చేరింది. వెండి ఔన్సు 2 శాతం కంటే ఎక్కువగా పెరిగి 47.18 డాలర్లకు చేరుకుంది. ప్రధానంగా అమెరికా డాలర్ బలహీనపడటం, అమెరికా ఫెడ్ రేట్ల కోత అంచనాలు, భౌగోళిక రాజకీయ, ఆర్థిక అనిశ్చితి, వెండికి పారిశ్రామికంగా అధిక డిమాండ్ ఏర్పడటం, వెండి సరఫరా తగ్గడం, సెంట్రల్ బ్యాంకుల కొనుగోళ్ల, రూపాయి విలువ బలహీనపడటం వంటి అంశాలు వెండి, బంగారం ధరలను ప్రభావితం చేస్తున్నాయి.

# బకాయిలతో ఎంఎస్ఎంఈల ఉనికి ప్రశ్నార్థకం



ముంబై, అక్టోబర్, 4 (సూర్యసేన ప్రతినిధి): దేశ ఆర్థికవ్యవస్థకు ఎంఎస్‌ఎంఈలు వెన్నెముక అయినప్పటికీ వినియోగదారుల(ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, దుకాణాలు, ప్రైవేటు వ్యక్తులు)నుంచి రావాల్సిన బకాయిలు సకాలంలో వసూలు కాకపోవడం వాటి అభివృద్ధికి ప్రతిబంధకాలుగా మారుతున్నాయని ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షుడు రవికుమార్ పేర్కొన్నారు.గ్లోబల్ అలయన్స్ ఫర్ మాస్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ (జీఏఎంఈ) అంచనా ప్రకారం 2024లో ఎంఎస్‌ఎంఈలకు రావాల్సిన బకాయిలు రూ.10.7 లక్షల కోట్లని, అందులో సుమారు 80శాతం సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల వాటా ఉందని చెప్పారు. ఈ సమస్యను పరిష్కరించకపోతే ఎంఎస్‌ఎంఈల ఉనికి ప్రశ్నార్థకమయ్యే పరిస్థితి నెలకొన్నదని పేర్కొన్నారు. ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్‌టీసీసీఐ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో ఎంఎస్‌ఎంఈల బకాయిలపై వర్క్‌షాప్ నిర్వహించారు.

ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. ఎంఎస్‌ఎంఈలకు రావాల్సిన బకాయిల వసూళ్ల కోసం రూపొందించిన సమాధాన్ పోర్టల్‌లో ఇప్పటివరకు 2,54,360 కేసులు నమోదు కాగా, వాటిలో కేవలం 50,803 మాత్రమే పరిష్కరించబడినట్లు చెప్పారు. ఎంఎస్‌ఎంఈలు మనుగడ సాగించాలంటే వేగవంతమైన, సమర్థవంతమైన పరిష్కార పద్ధతులు అవసరమని స్పష్టంచేశారు. పరిశ్రమలశాఖ సంయుక్త సంచాలకుడు రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎంఎస్‌ఎంఈ ఫెసిలిటేషన్ కౌన్సిళ్ల పనితీరు గురించి వివరించారు. కార్యక్రమంలో న్యాయవాది ప్రదీప్‌రెడ్డి, ఎఫ్‌టీసీసీఐ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ కృష్ణ, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

# ప్రపంచ అత్యంత విలువైన కార్ల కంపెనీల టాప్-10 జాబితాలో మారుతీ సుజుకి




ముంబై, అక్టోబర్, 4 (సూర్యసేన ప్రతినిధి): దేశీయ ప్యాసింజర్ కార్ల తయారీ దిగ్గజం మారుతీ సుజుకి అరుదైన ఘనతను సాధించింది. ప్రపంచంలోనే అత్యంత విలువైన టాప్-10 వాహన తయారీ కంపెనీల జాబితాలో చోటు దక్కించుకుంది.. దాదాపు 57.6 మిలియన్ డాలర్ల(మన కరెన్సీలో రూ. 511 కోట్ల) మార్కెట్ క్యాపిటలైజేషన్‌తో జాబితాలో ఎనిమిదవ స్థానాన్ని సొంతం చేసుకుంది. ఇది వోక్స్‌వ్యాగన్, ఫోర్డ్, జనరల్ మోటార్స్ లాంటి ఆటోమేకర్లను అధిగమించి. మారుతీ సుజుకి కంపెనీ మార్కెట్ విలువ పెరిగేందుకు అనేక కారణాలు ఉన్నప్పటికీ, ప్రధానంగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణల చర్యలు ఇందుకు దోహదపడ్డాయి. దేశీయ వాహన మార్కెట్లో మారుతీ సుజుకి బడ్జెట్ ధరల కార్లతో ఎక్కువమందిని ఆకర్షిస్తోంది. తాజా జీఎస్టీ సంస్కరణలతో తక్కువ ఇంజిన్ సామర్థ్యం ఉన్న కార్లపై జీఎస్టీ సుమారు 10 శాతం తగ్గడంతో కంపెనీకి చెందిన ఆల్టో, ఎస్-ప్రెస్సో, వ్యాగన్‌ఆర్ వంటి కార్లు మరింత సరసమైన ధరకు చేరాయి. దీంతో ఎక్కువమంది వినియోగదారులు మారుతీ సుజుకి కార్లు కొనేందుకు భారీగా బుకింగ్ చేసుకున్నారు. ఈ క్రమంలోనే కంపెనీ మార్కెట్ విలువ గణనీయంగా పెరిగింది. ప్రపంచ ఆటోమేకర్స్ ర్యాంకుల్లో అమెరికాకు చెందిన టెస్లా 1.4 ట్రిలియన్ డాలర్లతో అగ్రస్థానంలో ఉండగా, రెండో స్థానంలో టయోటా (314 బిలియన్ డాలర్లు), మూడవ స్థానంలో బీవైడీ (134.06 బిలియన్ డాలర్లు), నాలుగవ స్థానంలో ఫెరారీ (92.7 బిలియన్ డాలర్లు), ఐదవ స్థానంలో బీఎండబ్ల్యూ (61.3 బిలియన్ డాలర్లు), ఆరవ స్థానంలో మెర్సిడెస్ బెంజ్(59.8 బిలియన్ డాలర్లు) ఉన్నాయి. ఏడో స్థానంలో హోండా(59 బిలియన్ డాలర్లు), ఎనిమిదవ స్థానంలో మారుతీ సుజుకి(57.6 బిలియన్ డాలర్లు), తొమ్మిదవ స్థానంలో జనరల్ మోటార్స్(57.1 బిలియన్ డాలర్లు), ఫోక్స్‌వ్యాగన్(55.7 బిలియన్ డాలర్లు)తో పదో స్థానంలో ఉంది. ఇది వోక్స్‌వ్యాగన్, ఫోర్డ్, జనరల్ మోటార్స్ లాంటి ఆటోమేకర్లను అధిగమించి. మారుతీ సుజుకి కంపెనీ మార్కెట్ విలువ పెరిగేందుకు అనేక కారణాలు ఉన్నప్పటికీ, ప్రధానంగా ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ సంస్కరణల చర్యలు ఇందుకు దోహదపడ్డాయి. దేశీయ వాహన మార్కెట్లో మారుతీ సుజుకి బడ్జెట్ ధరల కార్లతో ఎక్కువమందిని ఆకర్షిస్తోంది.

# భారత జీడీపీ అంచనాను 6.7 శాతానికి పెంచిన ఈవై



ముంబై, అక్టోబర్, 4 (సూర్యసేన ప్రతినిధి): ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి భారత జాతీయోత్పత్తి(జీడీపీ) అంచనాలను పెంచుతున్నట్టు ప్రముఖ ప్రొఫెషనల్ సర్వీసెస్ సంస్థ ఈవై తాజా నివేదికలో తెలిపింది. 'ఎకానమీ వాచ్ ' నివేదిక ప్రకారం, జూన్ త్రైమాసికంలో వృద్ధి మెరుగ్గా ఉండటం, వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) సంస్కరణల నేపథ్యంలో గతంలో అంచనా వేసిన 6.5 శాతం నుంచి దేశ జీడీపీ 6.7 శాతం పెరుగుతుందని భావిస్తున్నట్టు వెల్లడించింది. తొలి త్రైమాసికంలో వాస్తవ జీడీపీ వృద్ధి 7.8 శాతమని ప్రభుత్వం ప్రకటించడం, జీఎస్టీ సంస్కరణల ద్వారా దేశంలో డిమాండ్ పుంజుకుందని, ముఖ్యంగా దేశ ఎగుమతులను ప్రభావితం చేసే గ్లోబల్ సవాళ్లను ఈ పరిణామాలు పరిమితం చేశాయని నివేదిక అభిప్రాయపడింది. వీటన్నిటినీ పరిగణలోకి తీసుకుంటే దేశ జీడీపీ 2025-26లో 6.7 శాతం వృద్ధి ఉంటుందని ఆశిస్తున్నట్టు నివేదిక పేర్కొంది. కొనసాగుతున్న అమెరికా టారిఫ్ సంబంధిత అనిశ్చితులు, సరఫరా అంతరాయం వల్ల భారత్‌కు ప్రపంచంలోని మిగిలిన ప్రాంతాలతో వాణిజ్య అవకాశాలు పెరుగుతాయి. ముఖ్యంగా యూఎస్, చైనాతో ఉన్న అంతర్జాతీయ వాణిజ్యం విధానాలను పునఃపరిశీలించడానికి వీలును కల్పిస్తాయి. ఎగుమతుల విషయంలో భారత్ అమెరికాపై, కొంతవరకు చైనాపై ఆధారపడి ఉంది. బ్రిక్స్ దేశాలలో మరిన్ని అవకాశాలను అన్వేషిస్తూ, అమెరికా, చైనా రెండింటిపై ఆధారపడటాన్ని తగ్గించడం ద్వారా భారత్ తన ఎగుమతులను, దిగుమతి వనరులను ఇతర మార్కెట్లకు మళ్లించాల్సిన సమయం వచ్చిందని ఈవై ఇండియా ప్రధాన సలహాదారు డీకే శ్రీవాస్తవ అన్నారు.

# అన్ని ఎలక్ట్రిక్ వాహనాలకు సౌండ్ అలర్ట్ సిస్టమ్ తప్పనిసరి



ముంబై, అక్టోబర్, 4 (సూర్యసేన ప్రతినిధి): ఎలక్ట్రిక్ వాహనాలకు సంబంధించి కేంద్రం కీలక ప్రతిపాదన తీసుకొచ్చింది. రోడ్డు భద్రతను దృష్టిలో ఉంచుకుని 2027, అక్టోబర్ 1 నుంచి అన్ని ఎలక్ట్రిక్ కార్లు, బస్సులు, ట్రక్కులకు అకౌస్టిక్ వెహికల్ అలర్ట్ సిస్టమ్ (ఏవీఏఎస్)ను తప్పనిసరి చేయాలని రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ ప్రతిపాదించింది.2026, అక్టోబర్ తర్వాత తయారు చేసే అన్ని కొత్త ఎలక్ట్రిక్ ప్యాసింజర్, కమర్షియల్ వాహనాల మోడళ్లలో ఏవీఏఎస్ అమర్చాలని మంత్రిత్వ శాఖ ముసాయిదా నోటిఫికేషన్‌లో పేర్కొంది. సాధారణంగా వాహనాలు రోడ్లపై వెళ్లే సమయంలో ఇంజిన్ శబ్దం కారణంగా హారన్ కొట్టకపోయినా గుర్తించడానికి వీలుంటుంది. అయితే, ఈవీల విషయంలో ఇది సాధ్యం కాదు. బ్యాటరీ, మోటార్‌తో పనిచేసే వాహనాలు కావడంతో ఈవీల నుంచి ఎలాంటి శబ్దం వెలువడదు. దానివల్ల వెనుక లేదా, కొన్ని ఇరుకైన వీధుల్లో ఈవీలు వస్తున్నట్టు గుర్తించడం కష్టంగా మారింది. దీనివల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటాయి. దీనికి పరిష్కారం అందించే లక్ష్యంతో కేంద్రం తాజా నిర్ణయం తీసుకుంది. నిర్దేశించిన తేది నుంచి అన్ని ఈవీలకు ఏవీఏఎస్ తప్పనిసరి చేయాలని భావిస్తోంది. ఏవీఏఎస్ అమర్చడం వల్ల వాహనాలు వెళ్లే సమయంలో కృత్రిమంగా శబ్దాన్ని విడుదల చేస్తాయి. దీనివల్ల పాదచారులైనా, మరే ఇతర వాహనదారులైనా వాహనం ఉన్నట్టు గుర్తించవచ్చు. ఇలాంటి వ్యవస్థను ఇప్పటికే అమెరికా, జపాన్ సహా కొన్ని యూరోపియన్ దేశాలు అమలు చేస్తున్నాయి.

# పోషకాహారం కోసం జొమాటో సరికొత్త ఫీచర్





ముంబై, అక్టోబర్, 4 (సూర్యసేన ప్రతినిధి): ప్రముఖ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో సోమవారం కొత్త ఫీచర్‌ను ప్రారంభించింది. కస్టమర్లు ఆర్డర్ చేసే సమయంలో పోషకాలతో ఉన్న ఆహారం ఎంచుకునేందుకు వీలుగా 'హెల్తీమోడ్' అనే ఫీచర్‌ను తీసుకొచ్చింది. ఈ ఫీచర్ ద్వారా కస్టమర్లు ఆర్డర్ చేసే ఫుడ్‌లోని పోషక విలువలకు సంబంధించిన రేటింగ్ తెలుసుకునే అవకాశం ఉంటుంది. వంటకాలకు ప్రోటీన్, కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు, ఫైబర్, సూక్ష్మపోషకాల ఆధారంగా లో నుంచి సూపర్ వరకు ఆరోగ్యకరమైన స్కోరు ఉంటుంది. జొమాటో యాప్ ప్రకారం, ప్రోటీన్ సాంద్రత, పదార్థాల నాణ్యత, వంట పద్ధతి, కార్బోహైడ్రేట్ నాణ్యత, ఇతర అంశాల ఆధారంగా స్కోరు ఉంటుంది. జొమాటో పేరెంట్ ఎటర్నల్ సీఈఓ దీపిందర్ గోయల్ దీని గురించి మాట్లాడుతూ.. కస్టమర్లు ఫుడ్ ఆర్డర్ చేసుకునే ప్రక్రియను మరింత సులభతరం చేశాం. కానీ ఆరోగ్యానికి మేలు చేసే ఆహారం అందించేందుకు ఇప్పటిదాకా సరైన అవకాశం లేదు. ఈ లోటును భర్తీ చేయాలనే ఉద్దేశంతోనే హెల్తీమోడ్ ఫీచర్ ప్రారంభించాం. దీని ద్వారా ఆహార పదార్థాలకు స్కోర్ ఉంటుంది. ప్రస్తుతం ఈ సదుపాయం గురుగ్రామ్‌లో మాత్రమే ఉంది. భవిష్యత్తులో దేశవ్యాప్తంగా ఇతర నగరాల్లోనూ అందుబాటులోకి తీసుకొస్తామని వివరించారు.

# దీపావళి పండక్కి కుర్ర హీరోల కొట్లాట



ఈసారి దీపావళి పండక్కి స్టార్ల క్లాష్ కావడం లేదు కానీ కుర్ర హీరోల మధ్య కొట్లాట పెద్దదే జరగనుంది. అక్టోబర్ పదహారు, పదిహేడు తేదీల్లో ఏకంగా నాలుగు సినిమాలు బాక్సాఫీస్ వద్ద తలపడబోతున్నాయి. హైప్ పరంగా వాటిలో మొదటిది సిద్ధూ జొన్నలగడ్డ తెలుసు కదా. నీరజ కోన దర్శకురాలిగా పరిచయమవుతున్న ఈ ట్రయాంగిల్ లవ్ స్టోరీలో శ్రీనిధి శెట్టి, రాశి ఖన్నా హీరోయిన్లుగా నటించారు. తమన్ కంపోజ్ చేసిన రెండు పాటలు ఆల్రెడీ మ్యూజిక్ లవర్స్ ని ఆకట్టుకున్నాయి. జాక్ ఇచ్చిన షాక్ నుంచి కోలుకున్న సిద్ధూ ఈసారి లౌడ్ కామెడీ లేకుండా రొమాంటిక్ జానర్ వైపు షిఫ్ట్ అయిపోవడం ఎలాంటి రిజల్ట్ ఇస్తుందో చూడాలి. రెండోది కిరణ్ అబ్బవరం కె ర్యాంప్. కేరళ బ్యాక్ డ్రాప్ లో నడిచే ఈ యూత్ మాస్ మూవీ బూతుల గురించి సోషల్ మీడియాలో పెద్ద చర్చే జరిగింది. హీరో దర్శకుడు తమవైపు వాదనలతో సమర్థించుకుంటున్నారు కానీ సెన్సార్ సర్టిఫికెట్ ని బట్టి ఇది ఏ క్యాటగిరీనో క్లారిటీ వస్తుంది. గత ఏడాది ఇదే టైంలో క రూపంలో బ్లాక్ బస్టర్ అందుకున్న కిరణ్ కు ఆ తర్వాత దిల్ రుబా మాస్టర్ స్ట్రోక్ ఇచ్చింది. సో కె ర్యాంప్ హిట్టు కావడం చాలా అవసరం. మూడోది ప్రదీప్ రంగనాథన్ డ్యూడ్. మైత్రి ప్రొడక్షన్ తో పాటు హీరోకు లవ్ టుడే, డ్రాగన్ పుణ్యమాని ఏర్పడిన మార్కెట్ వల్ల ఈ డబ్బింగ్ మూవీకి మంచి బిజినెస్ జరిగేలా ఉంది. నాలుగోది మిత్ర మండలి. ప్రియదర్శితో పాటు మరో ముగ్గురు క్యారెక్టర్ ఆర్టిస్టులు నటించిన ఈ ఎంటర్ టైనర్ మీద నిర్మాత బన్నీ వాస్ చాలా నమ్మకం వ్యక్తం చేస్తున్నారు. లిటిల్ హార్ట్స్, జాతి రత్నాలు తరహాలో ఇది కూడా సర్ప్రైజ్ బ్లాక్ బస్టర్ అవుతుందని ధీమాగా ఉన్నారు. పండగ టైంకి ఓజి, కాంతారా చాప్టర్ 1 ఫైనల్ రన్ లు దాదాపు చివరికి వచ్చేసి ఉంటాయి కాబట్టి ఫెస్టివల్ ని వాడుకోవడం కుర్ర హీరోల చేతిలో ఉంది. సెలవులు పరిమితంగా ఉన్నప్పటికీ వీటి బడ్జెట్ ల దృష్ట్యా పాజిటివ్ టాక్ వస్తే బడ్జెట్ లు త్వరగా రికవర్ అవుతాయి. అన్ని సినిమాల థియేట్రికల్ బిజినెస్ లు కలిపినా వంద కోట్ల లోపే ఉండబోవడం విశేషం.

## హమ్మయ్యా... ఓజి టికెట్ రేట్లకు విముక్తి



ఆంధ్రప్రదేశ్ లో ఓజి టికెట్ రేట్లకు ఇచ్చిన ప్రత్యేక పెంపు అక్టోబర్ 4తో ముగిసింది. ఆదివారం నుంచి సాధారణ రేట్లతో ప్రేక్షకులు ఈ సినిమాని ఎంజాయ్ చేయొచ్చు. అంటే మల్టీప్లెక్స్ 177, సింగల్ స్క్రీన్ 110 నుంచి 145 రూపాయలకు టికెట్లు దొరికేస్తాయి. స్కూళ్ళు, కాలేజీల సెలవులు అయిపోతున్న నేపథ్యంలో ఆక్యుపెన్సీ పరంగా సండే చాలా కీలకం కానుంది. ఇప్పటిదాకా ప్రతి టికెట్ మీద 150, 100 రూపాయలు అదనంగా ఉన్నా సరే పవన్ కళ్యాణ్ కోసం ఖర్చు పెట్టుకున్న ఆడియన్స్ కి అతి పెద్ద ఊరట దక్కడంతో మళ్ళీ కలెక్షన్లు ఊపందుకుంటాయనే నమ్మకంతో బయ్యర్లు ఎదురు చూస్తున్నారు. కాకపోతే కాంతార చాప్టర్ 1 ఏ లెజెండ్ రూపంలో ఓజికి పెద్ద స్పీడ్ బ్రేకర్ ఎదురయ్యింది. కేవలం వారం గ్యాప్ తో ఇంత పెద్ద సూపర్ హిట్ రావడం కలెక్షన్ల పరంగా ప్రభావం చూపించేదే. ఓజికి సెన్సార్ ఏ సర్టిఫికెట్ ఇవ్వడం చాలా చోట్ల ఇబ్బందికరంగా మారగా కాంతారకు ఆ టెన్షన్ ఏది లేదు. ఏపీ తెలంగాణలో అడ్వాన్స్ బుకింగ్స్ చాలా బాగా జరుగుతున్నాయి. కోర్టు తీర్పు పుణ్యమాని ఓజికి నాలుగో రోజే నార్మల్ రేట్లు పెట్టాల్సి రావడం ప్రేక్షకుల కోణంలో ప్లస్ కాగా ఏపీలో ఆలస్యం జరగడం పట్ల ఫ్యాన్స్ కొంత అసంతృప్తిగా ఉన్నారు. మూడు వందల కోట్లు దాటేసిన ఓజికి ఇంకో పది రోజులు మంచి రన్ దక్కొచ్చు.

## వెయ్యి కోట్ల ఫీటు సాధ్యమేనా కాంతార?

బాక్సాఫీస్ వద్ద బలంగా దూసుకుపోతున్న కాంతార చాప్టర్ 1 ఏ లెజెండ్ ఆశించిన దానికన్నా పెద్ద ఓపెనింగ్స్ తెచ్చుకోవడం హొంబాలే ఫిలిమ్స్ ని సంతోషంలో ముంచెత్తుతోంది. మొదటి రోజే తొంబై కోట్ల దగ్గరకు వెళ్ళిపోయిన ఈ డివోషనల్ డ్రామా వీకెండ్ బుకింగ్స్ తో అరాచకం స్పెల్లింగ్ రాయిస్తోంది. అయితే బుక్ మై షోలో చూపిస్తున్న నెంబర్స్ నిజమా కదా అనే దాని గురించి సోషల్ మీడియాలో పెద్ద డిబేట్లు జరుగుతున్నాయి. గంటకు బుక్ అవుతున్న టికెట్లకు, ఫైనల్ గా రోజు చివరిలో నమోదవుతున్న గ్రాస్ కి లంకె కుదరడం లేదని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఇందులో నిజమెంత నేది ఇప్పట్లో తెలియక పోవచ్చు. కాకపోతే కాంతార చాప్టర్ 1 ఏ లెజెండ్ స్ట్రాంగ్ గా ఉన్న మాట వాస్తవం. కర్ణాటకలో



వసూళ్లు భీభత్సంగా ఉండటంలో ఆశ్చర్యం లేదు కానీ ఏపీ, తెలంగాణలో అత్యధిక షోలు హౌస్ ఫుల్స్ నడుస్తూ ఉండటం గమనించాల్సిన విషయం. అయితే ఇంత దూకుడుగా ఉన్నా ఈ సినిమా వెయ్యి కోట్ల మార్కు అందుకుంటుందా అంటే అనుమానమే అంటున్నారు ట్రేడ్ విశ్లేషకులు. ఎందుకంటే కాంతారకు ఈసారి హిందీ ప్రేక్షకుల మద్దతు పూర్తి స్థాయిలో దక్కలేదు. ఫస్ట్ పార్ట్ కి కనెక్ట్ అయినంతగా దీన్ని దగ్గరకు తీసుకోలేకపోతున్నారని నెంబర్లు చూస్తే అర్థమవుతోంది. సండే పికప్ ఉన్నా సోమవారం ఉంచి డ్రాప్స్ ఆందోళనకరంగా ఉండొచ్చు.

నార్త్ అమెరికాలోనూ కాంతారకు బ్రహ్మరథం లేదు. వన్ మిలియన్ దాటేసింది కానీ టార్గెట్ గా పెట్టుకున్న టెన్ మిలియన్ మార్క్ అందుకోవాలంటే ఇప్పుడున్న ట్రెండ్ సరిపోదు. అమాంతం పికప్ కనిపించాలి. కానీ ఎన్ఆర్ఐలు ఓజిని నెత్తిన బెట్టుకున్నంత వేగంగా కాంతార చాప్టర్ 1ని స్వంతం చేసుకోలేకపోయారనేది అంకెలు చెబుతున్న సాక్ష్యం. ఇండియా వరకు చూసుకున్నా కాంతార అయిదు వందల కోట్లు దాటడం ఖాయమే. కాకపోతే అటుపై ఎక్కడ ఆగుతుందనేది ఇంకో రెండు మూడు రోజులు ఆగితే క్లారిటీ వస్తుంది. ఇప్పుడున్న పరిస్థితి ప్రకారం చూసుకుంటే వెయ్యి కోట్ల మైలురాయి ఏ మాత్రం ఈజీ కాదు.


## ఎంగేజ్మెంట్ జోష్.. రష్మిక నుంచి రిలీజ్ డేట్

రష్మిక మందన్నా పేరు నిన్నట్నుంచి సోషల్ మీడియాలో మార్మోగిపోతోంది. అందుక్కారణం టాలీవుడ్ యంగ్ హీరో విజయ్ దేవరకొండతో ఎంగేజ్మెంట్ చేసుకోవడమే. కొన్నేళ్ల నుంచి రిలేషన్‌షిప్‌లో ఉన్న ఈ జంట ఎట్టకేలకు నిశ్చితార్థం చేసుకుంది. ఇరు కుటుంబాల సభ్యుల మధ్య సింపుల్‌గా ఈ వేడుక జరిగిపోయింది. వచ్చే ఫిబ్రవరిలో వీరి పెళ్లి జరగనున్నట్లు తెలుస్తోంది. ఈ ఉత్సాహంలో చాన్నాళ్లుగా వాయిదా పడుతూ వస్తున్న తన కొత్త చిత్రం రిలీజ్ డేట్‌ను ప్రకటించింది రష్మిక. యాక్టర్ టర్న్డ్ డైరెక్టర్ రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో రష్మిక.. 'ది గర్ల్ ఫ్రెండ్' అన్టే లేడీ ఓరియెంటెడ్ మూవీలో నటిస్తున్న సంగతి తెలిసిందే. ఈ వేసవిలోనే ఈ చిత్రం రిలీజ్ కావాల్సింది. కానీ వాయిదా పడింది. చివరికి




సెప్టెంబరు 5న రిలీజ్ అన్నారు. కానీ ఆ డేట్‌ను కూడా అందుకోలేదు. చాలా రోజులుగా అసలు చర్చల్లో లేకుండా పోయిన ఈ సినిమాను ఒక ప్రోమోతో వార్తల్లోకి తీసుకొచ్చింది చిత్ర బృందం. ఇంట్రెస్టింగ్‌గా సాగిన ఆ ప్రోమో ద్వారా నవంబరు 7న ఈ చిత్రం విడుదల కానుందని వెల్లడించారు. ఒక అబ్బాయికి అమ్మాయి.. లేదా ఒక అమ్మాయికి అబ్బాయి కరెక్ట్ అని ఎలా నిర్ణయిస్తారు అనే టాపిక్ మీద ఒకరికొకరు ప్రశ్నలు సంధించుకున్న హీరో హీరోయిన్లు.. ఈ కన్ఫ్యూజన్ తీరాలంటే నవంబరు 7న థియేటర్లకు రండి మాట్లాడుకుందాం అంటూ పిలుపునిచ్చారు. ఈ చిత్రాన్ని గీతా ఆర్ట్స్ భాగస్వామ్యంలో విద్య కొప్పినీడి, ధీరజ్ మొగిలినేని నిర్మించారు. ఇందులో రష్మిక సరసన 'దసరా' ఫేమ్ ధీక్షిత్ శెట్టి శెట్టి కథానాయకుడిగా నటించాడు. 'చి ల సౌ'తో మెప్పించి.. 'మన్మథుడు-2'తో షాక్ తిన్న రాహుల్ రవీంద్రన్.. ఆ తర్వాత చాలా గ్యాప్ తీసుకుని ఈ చిత్రాన్ని రూపొందించాడు.

## ఛాంపియన్ కావాలంటే స్పీడ్ పెంచాల్సిందే



హీరో, నటుడు శ్రీకాంత్ వారసుడిగా తెరకు పరిచయమిన రోషన్ మేక తెరంగేట్రం జరిగి అయిదు సంవత్సరాలయ్యింది. 2021 పెళ్లి సందడి రిలీజయ్యాక మళ్ళీ కుర్రాడు తెరమీద కనిపించలేదు. స్వప్న సినిమాలో ఛాంపియన్ అంగీకరించాక వేరే కమిట్ మెంట్స్ ఇవ్వకుండా దాని కోసమే కష్టపడుతున్నాడు. నాలుగు నిర్మాణ సంస్థలు పాలు పంచుకుంటున్న ఈ ప్యాన్ ఇండియా మూవీ మీద నిర్మాత అశ్వినీదత్ యాభై కోట్ల దాకా బడ్జెట్ పెడుతున్నట్టు ఇన్ సైడ్ టాక్. దర్శకుడు ప్రదీప్ అద్వైతం మీద నమ్మకంతో ఎంత కాలయాపన జరుగుతున్నా సరే పట్టు వదలకుండా చిత్రీకరణ చేస్తూనే ఉన్నారు. రిలీజ్ ఎప్పుడో ఫైనల్ కాలేదు. ఒక పక్క కుర్రహీరోల మధ్య కాంపిటీషన్ పెరిగిపోతోంది. రోషన్ పేరుతోనే ఉన్న సుమ, రాజీవ్ కనకాల కొడుకు అప్పుడే రెండో మూవీ మోగ్లీతో పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ లాంటి పెద్ద సంస్థ ద్వారా ప్రేక్షకులను పలకరించబోతున్నాడు. సోషల్ మీడియా స్టార్ లిటిల్ హార్ట్స్ ఫేమ్ మౌళి చేతిలో నాలుగు సినిమాలున్నాయట. రోషన్ మేకతో పాటే పరిచయమైన హీరోయిన్ శ్రీలీల ఆల్రెడీ డబుల్ డిజిట్ చిత్రాలు పూర్తి చేసి మంచి బాలీవుడ్ లో కూడా అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. ఇలా తన సమకాలీకుల్లో దూసుకుపోతున్న వాళ్ళు ఎక్కువగా ఉన్నారు. సో ఈ కాంపిటీషన్ లో నెగ్గి ఛాంపియన్ కావాలంటే కుర్రాడు స్పీడ్ పెంచాల్సిందే. హిట్ సిరీస్ దర్శకుడు శైలేష్ కొలనుతో ఒక ప్రాజెక్ట్ లాకైయ్యిందనే వార్త ఫిలిం నగర్ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. ఇంకా అధికారికంగా తెలియాల్సి ఉంది. మోహన్ లాల్ భారీ బడ్జెట్ చిత్రం వృషభలోనూ నటించిన రోషన్ మేక అది కూడా ఆలస్యమవుతూ ఉండటం వల్ల వెయిటింగ్ లో ఉన్నాడు. ఈ దీపావళికి మోక్షం దక్కేలా ఉంది. అయిదేళ్ల కాలంలో రోషన్ ఇంత నెమ్మదిగా ఉండటం ఏ మాత్రం సేఫ్ కాదు. ఒక సినిమా మీద గట్టి నమ్మకం ఉంచుకోవడం మంచిదే. అలాని కాలాన్ని కర్పూరంలా కరిగించుకుంటూ పోతే పక్కోళ్ల రేస్ లో ముందుకు వెళ్ళిపోతారు. అందుకే అర్జెంట్ గా నడక నుంచి పరుగుకు మారాలి.

## మర్చిపోయిన గాయం ఇప్పుడెందుకు హృతిక్



వార్ 2 ఎంత పెద్ద డిజాస్టరో చెప్పనక్కర్లేదు. హృతిక్ రోషన్, జూనియర్ ఎన్టీఆర్ మొదటి కలయిక కావడంతో ఈ మల్టీస్టారర్ మీద దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే అభిమానుల నమ్మకాన్ని వమ్ము చేస్తూ దర్శకుడు అయాన్ ముఖర్జీ ఒక అండర్ కుక్డ్ యాక్షన్ థ్రిల్లర్ ఇవ్వడంతో కనీసం యావరేజ్ కూడా కాలేకపోయింది. తారక్ కి నెగటివ్ షేడ్ పెట్టి చివరిలో పాజిటివ్ గా మార్చి ఏదేదో చేశారు. అదే తెలుగు ఆడియన్స్ కోణంలో పెద్ద మైనస్ అయ్యింది. ఆగస్ట్ 14 విడుదలైన వార్ 2 ఇప్పటిదాకా ఓటిటిలో రాలేదు. ఇంకో అయిదు రోజుల్లో నెట్ ఫ్లిక్స్ లో రాబోతున్న నేపథ్యంలో హృతిక్ ఒక పోస్ట్ పెట్టాడు. ప్రతి సినిమాలాగే కబీర్ పాత్రలో వంద శాతం కష్టపడ్డానని, దర్శకుడు అయాన్ ముఖర్జీ ఎంతో బాగా చూసుకున్నాడని, చాలా ఉత్సాహంగా రాజీ పడకుండా చిత్రీకరణ జరిగిందని, అయినా ఫలితాలు ప్రతిసారి మన చేతిలో ఉండవని సుదీర్ఘమైన సందేశం పెట్టాడు. అయినా అందరూ మర్చిపోయిన గాయాన్ని ఇప్పుడెందుకు గుర్తు చేస్తున్నావ్ కబీర్ అంటూ ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు. మాములుగా నెట్ ఫ్లిక్స్ లో ఏదైనా పెద్ద సినిమా వస్తున్నప్పుడు అందులో లీడ్ యాక్టర్స్ ప్రమోషన్స్ చేయాల్సి ఉంటుంది. సాధారణంగా వీటిని ముందే షూట్ చేసి ఓటిటి రిలీజ్ టైంలో వదులుతారు. కానీ హృతిక్ వెరైటీగా ప్రమోట్ చేస్తున్నాడేమో. ఏదేమైనా వార్ 2 అయిపోయిన గతం. ఇలా తవ్వడం వల్ల ఎలాంటి ప్రయోజనం కానీ సానుభూతి కానీ ఉండవు. జూనియర్ ఎన్టీఆర్ దీని గురించి గత రెండు నెలల్లో ఎక్కడా స్పందించలేదు. పలు సందర్భాల్లో బయటికి వచ్చినా, కాంతార ప్రీ రిలీజ్ ఈవెంట్ లో మాట్లాడినా ఆ ప్రస్తావన తీసుకురాలేదు. తొమ్మిది నుంచి స్ట్రీమింగ్ మొదలయ్యాక బహుశా ఒకటి రెండు వీడియోలు రావొచ్చు. వార్ 2 వల్లే మళ్ళీ సౌత్, నార్త్ స్టార్లు కలిసి నటించే మల్టీస్టారర్స్ ఇప్పట్లో రాకపోవచ్చనే అంచనాలు బలంగా ఉన్న నేపథ్యంలో అసలు వార్ 3 అయినా ఉంటుందా లేదా అనే దాని మీద రకరకాల అనుమానాలు నెలకొన్నాయి.

E-PAPER
visit us @ http://e-paper.sooryasena.com



www.sooryasena.com

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY **PALVAI JANAIAH,** PRINTED AT **R K ART PRINTERS,** H.NO. 1-9-277/23/B, VIDYANAGAR, NALLAKUNTA, HYDERABAD-500044, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 2-1-115/3/16/1, MAMILLAGADDA, SURYAPET-508213,NALGONDA DISTRICT, TELANGANA STATE. **EDITOR : PALVAI JANAIAH,**
**RNI. No: TELTEL/2023/85598,** CELL: 9951241048, EMAIL : srptsurya@gmail.com